ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
శనివారం 24 ఆగస్టు 2024



మైసూరివారిపల్లె గ్రామ సభలో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్

రైల్వేకోడూరును పండ్ల రాజధాని చేస్తా..



జ్యోతిప్రజ్వలన గావిస్తున్న పవన్‌కళ్యాణ్, తదితరులు

- కూటమి ప్రభుత్వంతోనే గ్రామాలు బలోపేతం
- స్వర్ణ గ్రామపంచాయతీలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్
- మైసూరివారిపల్లె గ్రామసభ విజయవంతం

రైల్వేకోడూరు, ఆగస్టు 23: రైల్వేకోడూరును పండ్ల రాజధానిగా చేస్తామని, ఇక్కడ స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్శిటీ ఏర్పాటు చేస్తామని తద్వారా రాయలసీమ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ తెలిపారు. శుక్రవారం రైల్వేకోడూరు మండలంలోని మైసూరివారిపల్లె జనసేన మహిళా సర్పంచ్ కారుమంచి సంయుక్త అధ్యక్షతన నిర్వహించిన గ్రామ సభకు ఆయన హాజరయ్యారు. ముందుగా జ్యోతిప్రజ్వలన చేసి, వందేమాతరం గేయాన్ని విద్యార్థులు ఆలపించిన అనంతరం సభ ప్రారంభించారు. ఈ సందర్భంగా పవన్‌కళ్యాణ్ మాట్లాడుతూ గ్రామాలు పచ్చగా ఉంటేనే దేశం పచ్చగా ఉంటుందన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థ నిర్వీర్యమైపోయిన సమయంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సగర్వంగా గ్రామ సభలను నిర్వహించుకుంటున్నామని తెలిపారు. గత ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు నిధులు ఇవ్వకుండా చేస్తే.. ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో నిధులు ఇచ్చి బలోపేతం చేస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 13,326 పంచాయతీల్లో గ్రామ సభలను నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామ పంచాయతీలను స్వర్ణ పంచాయతీలుగా తీర్చిదిద్దడమే గ్రామసభ లక్ష్యమని తెలిపారు. రైల్వేకోడూరును పండ్ల రాజధానిగా చేస్తామని అన్నారు. రైల్వేకోడూరులో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్శిటీ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. ఇక్కడ నైపుణ్య విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తే రైల్వేకోడూరు ప్రాంతమే కాకుండా మొత్తం రాయలసీమ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని ఒక మహిళ ద్వారా తెలుసుకున్నానని తెలిపారు. అన్నమయ్య డ్యాం తెగిపోయినప్పుడు జరిగిన నష్టాన్ని చూసి తన హృదయం చలించిపోయిందన్నారు. ఆ పరిస్థితిలో తనకు అధికారం ఉంటే ఏదో ఒకటి చేయగలిగే వాడినని తెలిపారు. యువత నుంచి తాను కోరుకునేది ఒకటేనని.. అదే సామాజిక బాధ్యత అని యువతకు సందేశం ఇచ్చారు. అదేవిధంగా మంగంపేట బెరైటీస్‌పై ప్రత్యేక శ్రద్ధ వహిస్తామని, మంగంపేటలో ఉద్యోగాలను యువతకు ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. మైసూరివారిపల్లెలో పక్కా గృహాలు కావాలని అడిగారని వెంటనే మంజూరు చర్యలు తీసుకుంటామని తెలిపారు. వెంటనే ఏపీఎండీసీపై దృష్టి సారించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. అదేవిధంగా రైతులకు పంటను గిట్టుబాటు ధరలకు అమ్ముకునేందుకు శీతలగిడ్డంగి ఏర్పాటుకు ఉప ముఖ్యమంత్రి కార్యాలయంలో ప్రత్యేకంగా పర్యవేక్షించి ఏర్పాటు చేయిస్తామన్నారు. ఆస్పత్రి కూడా ఏర్పాటు చేయిస్తామన్నారు. అరటికి బీమా రావడం లేదని రైతులు చెప్పడంతో దీన్ని కూడా పర్యవేక్షిస్తామని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం వ్యవస్థల్ని ఛిన్నాభిన్నం చేసిందని, పంచాయతీరాజ్ వ్యవస్థను నాశనం చేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. మైసూరివారిపల్లె మహిళా సర్పంచ్ కారుమంచి సంయుక్త భర్త వెంకటసుబ్బయ్య మాజీ సైనికుడు అని, ఆయన భౌతికంగా లేకపోయినా గ్రామ ప్రజలు అండగా నిలిచి పంచాయతీ సర్పంచ్‌గా గెలిపించడంతో తన గుండె కదిలిందన్నారు. ఇలాంటి ఆడబిడ్డ రాజకీయాల్లో ఉండాలని అనుకున్నామని తెలిపారు.

అనంతరం మైసూరివారిపల్లె సర్పంచ్ కారుమంచి సంయుక్త మాట్లాడుతూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ తమ గ్రామ పంచాయతీకి రావడం సంతోషంగా ఉందన్నారు. ఉద్యాన పంటలకు బీమా సౌకర్యం కల్పించాలని, గుంజనదికి రక్షణగోడ నిర్మాణం, సీసీ రోడ్లు, అండర్ డ్రైనేజి సౌకర్యం కావాలని కోరారు. ఎమ్మెల్యే అరవ శ్రీధర్ మాట్లాడుతూ రైల్వేకోడూరును ఆంధ్రప్రదేశ్ ఉద్యాన రాజధానిగా పిలుస్తారన్నారు. ఏపీఎండీసీలో రైల్వేకోడూరు స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. కలెక్టర్ చామకూరి శ్రీధర్ మాట్లాడుతూ గ్రామ సభల ద్వారా పరిపాలన పారదర్శకత, జవాబుదారీ తనాన్ని బలోపేతం చేయవచ్చని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి ఇచ్చిన స్ఫూర్తితో జిల్లాను ముందుకు తీసుకెళ్లడానికి అన్ని విధాల కృషి చేస్తామన్నారు.

రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్టీరామారావు తర్వాత చలనచిత్ర పరిశ్రమ నుంచి వచ్చి రాజకీయంగా బలమైన నేతగా ఎదిగిన నాయకుడు పవన్‌కళ్యాణ్ అని కొనియాడారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో గ్రామాలు బలోపేతం అవుతాయని, గత ప్రభుత్వం గ్రామాలను నిర్వీర్యం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి, రాయలసీమ జోన్ ఇన్‌చార్జులు వగడాల వెంకటేశ్, జోగినేని మణి, జనసేన నాయకుడు యనమల భాస్కర్‌రావు, జనసేన కడప నియోజకవర్గ ఇన్‌చార్జి సుంకర శ్రీనివాస్, జిల్లా స్థాయి అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.



హాజరైన జిల్లా స్థాయి అధికారులు, రాజకీయ నాయకులు



పలువురు ఘనస్వాగతం

గ్రామసభకు విచ్చేసిన ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు కూటమి నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. విజయవాడ నుంచి ప్రత్యేక విమానంలో పవన్ రేణిగుంట విమానాశ్రయంలో దిగారు. అక్కడి నుంచి రోడ్డుమార్గాన 10:40 గంటలకు మైసూరివారిపల్లెకు చేరుకున్నారు. పవన్‌కళ్యాణ్‌కు అడుగడుగునా ప్రజలు నీరాజనాలు పలికారు. సభ మధ్యాహ్నం 12:40కు ముగియగా, 1:20కు రాజంపేటకు బయలుదేరివెళ్లారు.

మైదానానికి 30 సెంట్ల స్థలం వితరణ

మైసూరివారిపల్లెలో ప్రభుత్వ భూమి 8 సెంట్లు మాత్రమే ఉండడం ఆశ్చర్యంగా ఉందని పవన్ కళ్యాణ్ అన్నారు. యువత, విద్యార్థులు క్రీడా మైదానం కావాలని కోరుతున్నారని, దాతలు ముందుకు వస్తే ఆటస్థలం ఏర్పాటు చేస్తామన్నారు. వెంటనే స్పందించిన రైతు కారుమంచి నారాయణ తనకు ఉన్న 30 సెంట్ల స్థలాన్ని ఇస్తానని ప్రకటించడంతో పవన్‌కళ్యాణ్ ఆయనను వేదికపైకి పిలిచి అభినందించారు.



30 సెంట్ల స్థలాన్ని ఇచ్చిన నారాయణను అభినందిస్తున్న పవన్‌కళ్యాణ్



గ్రామసభ పుస్తకాన్ని చూపుతున్న వృద్ధురాలు



మాట్లాడుతున్న సర్పంచ్ సంయుక్త





గ్రామసభకు హాజరైన ప్రజలు

హైలెవల్ కమిటీ వేసి న్యాయం చేస్తా

- అన్నమయ్య ప్రాజెక్టు బాధితులకు..
- డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ హామీ

రాజంపేట, ఆగస్టు 23: అన్నమయ్య ప్రాజెక్టు ముంపు బాధితులను అన్నివిధాల ఆదుకుంటామని ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ హామీ ఇచ్చారు. రైల్వేకోడూరు గ్రామసభ ముగిసిన అనంతరం సాయంత్రం 4:30 గంటలకు పులపత్తూరులో ఏర్పాటు చేసిన గ్రామసభకు ఆయన హాజరయ్యారు. అక్కడ ముంపు బాధితులతో సమావేశమై మాట్లాడారు. ఈ సందర్భంగా మందపల్లె గ్రామానికి చెందిన బాధితులు, సీనియర్ టీడీపీ నాయకులు కొండా శ్రీనివాసులు, అడపాల సురేశ్, రామన్నగారి రజని తదితరులు తమ సమస్యలను పవన్‌కళ్యాణ్ ఎదుట ఏకరువపెట్టారు. ప్రాజెక్టు తెగిపోయి మూడు సంవత్సరాలైనా ఇంతవరకు తమకు ఎటువంటి న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం వైసీపీ ఓటుబ్యాంకు ఉన్న పులపత్తూరు గ్రామానికే నాటి సీఎం జగన్ అన్నివిధాల న్యాయం చేశారని, తమ గ్రామాలకు ఎటువంటి న్యాయం చేయలేదన్నారు. పాలేశ్వరస్వామి ఆలయం కొట్టుకుపోయినా తిరిగి పునరుద్ధరించలేదన్నారు. వ్యవసాయ రుణమాఫీలు చేస్తామని చెప్పి ఇప్పటికి అతీగతీ లేదన్నారు. అనంతరం పవన్‌కళ్యాణ్ మాట్లాడుతూ.. ముంపు బాధిత ప్రజల బాధను అర్థం చేసుకున్నానని, సంఘటన జరిగినప్పటి నుంచి ఇప్పటివరకు సరైన పర్యవేక్షణ జరగలేదన్నారు. ఈ సంఘటనపై హైలెవల్ కమిటీ వేసి పూర్తిస్థాయిలో విచారణ చేసి తక్షణం చర్యలు తీసుకుంటామన్నారు. నాడు అనేక మందిని కాపాడిన లష్కర్ రామయ్యను అభినందించామన్నారు. వరద ప్రాంతాల ఫొటో ఎగ్జిబిషన్ పరిశీలించానని, ఉప ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఈ సమస్యను ప్రత్యేకంగా పర్యవేక్షించి ఉన్నతాధికారుల బృందంతో విచారణ చేయిస్తానన్నారు. అన్నమయ్య ప్రాజెక్టును పునర్నిర్మాణం చేస్తామన్నారు.



సమస్యలను ఏకరవు పెడుతున్న మందపల్లె ముంపు బాధితులు

ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ రాష్ట్ర కమిషనర్ వీఆర్ కృష్ణతేజ, కలెక్టర్ శ్రీధర్, జేసీ ఆదర్శ రాజేంద్రన్, సబ్‌కలెక్టర్లు నిధియాదేవి, మేఘస్వరూప్, తిరుపతి, కోడూరు ఎమ్మెల్యేలు శ్రీనివాసులు, శ్రీధర్, జనసేనపార్టీ నాయకులు అతికారి కృష్ణ, అతికారి దినేష్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు, బీజేపీ నాయకుడు నాగోతు రమేశ్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గందరగోళంగా పులపత్తూరు సభ

పులపత్తూరులో జరిగిన ముంపుబాధితుల గ్రామసభ గందరగోళంగా సాగింది. ఏర్పాట్లు చేయడంలో యంత్రాంగం పూర్తిగా విఫలమైంది. అక్కడ కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయకపోగా, గ్రామసభలో ఉప ముఖ్యమంత్రి కూర్చొని మాట్లాడే వేదికను సక్రమంగా ఏర్పాటు చేయకపోవడం విమర్శలకు తావిచ్చింది. పవన్‌కళ్యాణ్ సభ మధ్యాహ్నం ఒంటిగంటకు ప్రారంభించాల్సి ఉండగా సాయంత్రం ఐదు గంటలైంది. ఉదయం నుంచి అటు బాధిత గ్రామాల ప్రజలు, అధికారులు చూసి చూసి విసిగిపోయారు. వారికి భోజన వసతి కూడా లేకపోవడంతో అప్పటికప్పుడు టీడీపీ జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు వందలాది మందికి భోజనాలు ఏర్పాటు చేశారు. సభాస్థలి ప్రాంతంలో ఒక్క పోలీసు కూడా లేకపోవడంతో యువకుల హంగామా ఎక్కువైంది. పవన్ రాగానే ఒక్కసారిగా వారంతా ముందుకు దూసుకెళ్లిపోయారు. పవన్ జిందాబాద్ అంటూ కేరింతలు కొట్టారు. దీంతో ఉపముఖ్యమంత్రి స్థాయిలో జరిగే ప్రభుత్వ కార్యక్రమం రిలీజ్ రోజున సినిమాలో తొక్కిసలాటగా మారిపోయింది. దీనివల్ల అన్నమయ్య ప్రాజెక్టు బాధిత ప్రజలు తమ గోడు చెప్పుకోవడం దేవుడెరుగు చాలామందికి ఉప ముఖ్యమంత్రిని చూసే భాగ్యం కూడా లేకుండా పోయింది. ఇక్కడి కార్యక్రమం ముగిసిన అనంతరం పవన్‌కళ్యాణ్ రోడ్డు మార్గాన బయలుదేరి రేణిగుంట వెళ్లారు.



అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోయినప్పటి ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న పవన్‌కళ్యాణ్



ముంపు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఉపముఖ్యమంత్రి



ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు ఘన స్వాగతం పలుకుతున్న జనసేన నాయకుడు అతికారి కృష్ణ

టంగుటూరి ప్రకాశం అందరికీ ఆదర్శం కావాలి

- డీఆర్‌ఓ సత్యనారాయణ

రాయచోటి(కలెక్టరేట్), ఆగస్టు 23: ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు అడుగుజాడలు అందరికీ ఆదర్శం కావాలని డీఆర్‌ఓ సత్యనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం రాయచోటి కలెక్టరేట్‌లో టంగుటూరి ప్రకాశం పంతులు 152వ జయంతి వేడుకలు బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ మాట్లాడుతూ స్వాతంత్ర ఉద్యమంలో భాగంగా సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా జరిగిన నిరసనలో తన చొక్కాను చించి ధైర్యంగా బ్రిటీష్ వారిపై తిరగబడ్డ ధైర్యశాలి అని కొనియాడారు. అంతేకాకుండా ప్రజాసేవ కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత వ్యక్తి అని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమశాఖ అధికారి సందప్ప, కలెక్టరేట్ ఏఓ నాగభూషణం, సిబ్బంది పాల్గొన్నారు.



టంగుటూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న డీఆర్‌ఓ సత్యనారాయణ, తదితరులు

సీఎంఏ ఫలితాల్లో మెరిసిన రైతు బిడ్డ

- ఆలిండియాలో మొదటి ర్యాంకు



తేజశ్విని

తంబళ్లపల్లె, ఆగస్టు 23: తంబళ్లపల్లె మండలం కన్నెమడుగుకు చెందిన రైతు కె.రఘురాంరెడ్డి, నాగవేణి దంపతుల కుమార్తె తేజశ్విని శుక్రవారం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన సర్టిఫైడ్ మేనేజ్‌మెంట్ అకౌంటెంట్ (సీఎంఏ) ఫైనల్ ఫలితాల్లో సత్తా చాటి ఆలిండియా మొదటి ర్యాంకు సాధించింది. ఓ సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన తేజశ్విని తల్లితండ్రుల కష్టాన్ని చూస్తూ చిన్నతనం నుంచే చదువులో ప్రతిభ కనపర్చేది. ప్రాథమిక విద్యను తంబళ్లపల్లెలో పూర్తి చేసి జవహర్ నవోదయలో సీటు సాధించింది. సీఏ చేయాలనే పట్టుదలతో సీఎంఏ పరీక్షల ఫలితాల్లో జాతీయ స్థాయిలో మొదటి ర్యాంకు సాధించింది. సీఎంఏలో ఆలిండియా మొదటి ర్యాంకు సాధించడంపై మండల విద్యాశాఖాధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు అభినందించారు. కాగా, గత నెల జూలై 11న విడుదలైన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియాలో (ఐసీఏఐ) సీఏ ఫైనల్ ఫలితాల్లోనూ ఆలిండియా 14వ ర్యాంకు సాధించింది.

త్వరలో 'శ్రీరామ ఎత్తిపోతల' పనులు ప్రారంభం

ఒంటిమిట్ట, ఆగస్టు 23: సోమశిల వెనుకజలాల నుంచి ఒంటిమిట్ట చెరువుకు ఎత్తిపోతల పథకం ద్వారా నీరు చేరే కార్యక్రమానికి త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి. గత టీడీపీ ప్రభుత్వం రూ.33 కోట్లతో అభివృద్ధి పనులను చేపట్టింది. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం శ్రీరామ ఎత్తిపోతల పథకాన్ని మూలనపడేయడంతో గత కొద్దిరోజులుగా స్థానిక రైతులు, టీడీపీ నాయకులు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన జిల్లా యంత్రాంగం శ్రీరామ ఎత్తిపోతల పథకానికి పనులను ప్రారంభించేందుకు ఏర్పాట్లను చేపట్టారు. ఈ మేరకు తూర్పుగోదావరి జిల్లాకు చెందిన దిలీప్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలోని బృందం సోమశిల ప్రాంతాన్ని శుక్రవారం తనిఖీ చేపట్టారు. ఎత్తి పోతల పథకంలో ఉన్న లోపాలను పరిశీలించి పనులు ప్రారంభించేందుకు అంగీకరించారు. డీఈ వాసుదేవరెడ్డి ఆధ్వర్యంలో శనివారం నుంచి ఎక్స కవేటర్లతో కంపచెట్లను తొలగించే పనులను ప్రా రంభించి అనంతరం పైపులైను పనులను చేపడ తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు మం జూరుకు ఆలస్యం కావడంతో, టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు ప్రస్తుతానికి తన సొంత నిధులను వెచ్చిస్తానని ప్రతినిధులకు హామీ ఇచ్చారు.

పాకల్లోనే బతుకులు - 'కూటమి'పై ఆశలు



భారతావణి వజ్రోత్సవాలు దాటినా మారని తలరాతలు ● పక్కా ఇళ్ల కోసం ఎదురుచూపులు
అర్హులకు అన్యాయం చేసిన వైసీపీ ● ఎన్‌టీఆర్ గృహనిర్మాణం ఇళ్లకు నిధులు కోరిన లబ్ధిదారులు

సుండుపల్లె, ఆగస్టు 23: సుమారు 78 ఏళ్ల స్వతంత్ర్య భారతావణిలో ఇంకా పేదల బతుకులు పాకలకే పరిమితమ య్యాయి. ప్రజాస్వామ్యంలో అంతా సమానమే అన్న పాలకుల ప్రకటనలు కాగితాల్లోనే మిగిలిపోయాయి. ఇంతజేసినా బడుగు బలహీన వర్గాల తలరాతలు నేతలు మార్చలేకపోతున్నారు. వేగం పెంచి ఇంటర్‌నెట్ సేవలు పరిగెడు తున్నా పేదల బతుకులు బోదకొట్టాలు, టెంకాయ పట్టలతో నిర్మితమైన పాకలు, అడవిలో దొరికే తడికలతో వేసుకున్న గుడిసెల్లోనే నిలుచున్నాయి. పేదల సొంతింటికల నెరవేరుస్తానని ప్రకటనలు గుప్పించి గంపగుత్తగా ఓట్లు దండుకున్న వైసీపీ అధినేత జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టి పేదలను విస్మరించారు. మోస గించబడిన పేదలు వైసీపీ ప్రభుత్వానికి సమాధికట్టారు. ప్రస్తుతం అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వంపై పేద లు ఆశలు పెట్టుకున్నారు. వివరాల్లోకెళితే...

వజ్రోత్సవాలు దాటిన భారత్‌లో వేగవంతమైన 4జీ, 5జీ ఇంటర్నెట్ సేవలు వినియోగిస్తున్న సమయంలో కాలనీలు, యానాది కాలనీలు, దళితవాడల్లో నిరుపేద కుటుంబాలు బోదకొట్టాలు, టెంకాయ పట్టలతో నిర్మించిన పాకలు, తడికలతో గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నారు. పేదల సొంతింటికల నెరవేరుస్తానని, అదే నా లక్ష్యమని, జగనన్న కాలనీలు నిర్మిస్తామని చెప్పి మోస గించారు. 2024 సార్వత్రిక ఎన్నికల అనంతరం రాష్ట్రంలో ప్రభుత్వం మారింది. పేదరికంతో జీవనం సాగిస్తున్న గిరిజనులకు సొంతింటికల నెరవేరుతుందని ఆశతో ఎదురు చూస్తున్నారు. జనార్థన్‌రెడ్డి (యానాదికాలనీ), అక్కంపల్లె యానాది కాలనీ సహా మరికొన్ని గ్రామాల్లో ప్రజలు పాకల్లో, వసారాల్లో, పాలిథిన్ పట్టల పూరి గుడిసెల్లో, శిథిలమైన మట్టి గృహాల్లో బతుకు సాగిస్తున్న పేదలు ఆశలు పెట్టుకున్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు భూమి ఇచ్చి రూ.4 లక్షలతో ఇళ్లు నిర్మిస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించడంతో పేదల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. వైసీపీ ప్రభుత్వం గృహ నిర్మాణం కింద పేదలకు సొంత ఇళ్లు నిర్మించి ఇవ్వలేదు. ప్రధాన మంత్రి గ్రామీణ ఆవాస్ యోజన కింద రెండేళ్ల కిందట 2022 ఏప్రిల్ నుంచి 2430 ఇళ్లు మంజూరు చేశారు. వాటిలో 948 ఇళ్లు మాత్రమే పూర్తి చేశారు. మిగతావి వివిధ దశల్లో ఉన్నాయి. చేయూత ఇస్తుందనుకున్న వైసీపీ ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయకపోగా పనులు ఆగిపోయాయి.

అందని బిల్లులు

ఐదేళ్ల కిందట ఎన్టీఆర్ గృహ నిర్మాణం పథకం కింద 14 పంచాయతీల్లోని పేదలకు గృహాలు మంజూరు చేశారు. వివిధ దశల్లో ఉన్న నిర్మాణాలకు అరకొరగా బిల్లులు చెల్లించింది. ఇంకా లబ్ధిదారులకు బిల్లులు చెల్లించాల్సి ఉండగా ప్రభుత్వం మారింది. వైసీపీ అధికారం చేపట్టడంతో టీడీపీ ప్రభుత్వం మంజూరు చేసిన గృహాలకు బిల్లులు మంజూరు చేయలేదు. ఫలితంగా కొందరు అప్పు చేసి ఇంటి నిర్మాణాలు చేశారు. మరికొందరు ఇంటి నిర్మాణాలు చేయలేని పరిస్థితిలో ఉన్నారు. దీంతో నిర్మాణాలు పూర్తి చేయలేక పేదలు ఇబ్బందులకు గురవుతున్నారు. మండల వ్యాప్తంగా సుమారు 500కుపైన 'ఎన్టీఆర్ గృహ నిర్మాణం' ఇళ్లకు బిల్లులు వేయాల్సి ఉంది. అప్పట్లో నిర్మాణాలు ప్రారంభించిన ఇళ్లకు కూటమి ప్రభుత్వం నిధులు ఇవ్వాలని, నిర్మాణాలు పూర్తి చేసేందుకు అదనంగా ఇవ్వాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

పట్టాలిచ్చారు... స్థలం లేదు !

మండలంలో జగనన్న ఇంటి పట్టాల పంపిణీ అంతా మాయాజాలంగా జరిగింది. పేదలకు ఇంటి పట్టాలు ఇస్తున్నాము. అర్హులను గుర్తించామని డప్పు కొట్టుకున్న వైసీపీ నేతలు, ఇంటి పట్టాలు ఇచ్చారు కానీ స్థలం చూపలేదు. పేపర్ల మీద అంకెల గారడీతో ప్రజలను మోసగించారని తీవ్ర విమర్శలున్నాయి. 200 మంది లబ్ధిదారులను గుర్తించి జగనన్న ఇంటి పట్టా పేరిట పుస్తకాలు పంపిణీ చేశారు. కానీ ఇంటి స్థలం చూప లేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు అడిగితే ఈ రోజు రేపు అని ఐదేళ్లు దాటవేశారు. ఈ ప్రభుత్వంలోనైనా నిజమైన అర్హులను గుర్తించి ఇంటి పట్టాలు ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే గత ప్రభుత్వంలో ఇచ్చిన ఇంటి పట్టాలకు ఇంటి స్థలం చూపించాలని లబ్ధిదారులు కోరుకుంటున్నారు.



బోదకొట్టం ఊయలలో నిద్రపోతున్న చిన్నారి

ప్రభుత్వం నిధులు విడుదల చేయాలి

వైసీపీ ప్రభుత్వంలో లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటి నిర్మాణానికి రూ.1.80 వేలు ప్రభుత్వం చెల్లిం చింది. పెండింగ్‌లో ఉండే ఇంటి నిర్మాణాలకు కూటమి ప్రభుత్వం నగదు విడుదల చేయాల్సి ఉంది. త్వరితగతిన ఇంటి నిర్మాణాలు పూర్తి చేయించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు ఉన్నాయి. 2014 టీడీపీ ప్రభుత్వంలో ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం కింద మంజూరైన, కట్టుకున్న ఇంటి నిర్మాణ దారుల వివరాలు సేకరిస్తున్నాము. మండల వ్యాప్తంగా 500 మంది లబ్ధిదారులు ఉన్నట్లు వారికి ప్రభుత్వం నుంచి నిధులు రావాల్సి ఉంది. కొత్తగా ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే అర్హులకు పక్కా గృహాలు మంజూరయ్యేలా చూస్తాము.

నాగరాజు, హౌసింగ్ ఏఈ

పట్టా ఇచ్చారు.. స్థలం చూపలేదు



వైసీపీ ప్రభుత్వంలో ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసుకున్నాము. అర్హులుగా ప్రభుత్వం గుర్తించి ఇంటి పట్టా మంజూరు చేసింది. అనంతరం జగనన్న ఇంటి పట్టా ఇచ్చినా స్థలం చూపించలేదు. అధికారులను అడిగితే ఇప్పుడు పట్టించుకోవడం లేదు. అక్కం పల్లి గుట్టపై గుడిసెలో నివాసం ఉంటున్నాము. స్థలం చూపిస్తే ఇంటి నిర్మాణం చేసుకుంటాము.

లక్ష్మీదేవి, అక్కంపల్లి

బోద గుడిసెలో కాపురం



ఓ దాత ఇంటి స్థలం ఇచ్చారు. బోద గుడిసె వేసుకుని కాపురం చేస్తున్నాము. వైసీపీ ప్రభుత్వంలో గృహ నిర్మాణం కోసం అర్జీలు పెట్టుకున్నాము. ఇంటి నిర్మాణానికి అనుమతులు రాలేదు. ప్రస్తుతం ఇంటి నిర్మాణం చేసుకుంటే రూ.4 లక్షలు ప్రభుత్వం చెల్లిస్తుందని అంటున్నారు. పక్కా గృహం మంజూరు చేస్తే ఇంటి నిర్మాణం చేసుకుంటాము.

కృష్ణవేణి, జనార్థన్‌రెడ్డి నగర్ కాలనీ

చరిత్రలో నిలిచిపోతారు



కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇంటి నిర్మాణానికి లబ్ధిదారులకు రూ.4 లక్షలు ఇస్తామని ప్రకటించారు. చరిత్రలో ఏ సీఎం చేయని విధంగా పేదల కోసం చంద్రబాబు ప్రకటించారు. లబ్ధిదారులకు నాలుగు లక్షలు ఇస్తే ఇంటి నిర్మాణం సులభతరం అవుతుంది. ప్రతి పేదవాడి సొంతింటి కల నెరవేర్చాలన్న నిర్ణయం చారిత్రాత్మకం.

శ్రీధర్, బేరిపల్లి

సన్నీ సేవలు అభినందనీయం : ఎస్పీ

పోలీసు జాగిలం బాధ్యతా విరమణలో ఘనసన్మానం



పెరేడ్‌లో మంత్రి ఫరూక్‌తో సన్నీ (ఫైల్ ఫొటో) - సన్నీని సన్మానిస్తున్న ఎస్పీ

కడప (క్రైం), ఆగస్టు 23: పోలీసు జాగిలం సన్నీ 11 ఏళ్లపాటు విశిష్ట సేవలందించి పలు కీలక విధులను సమర్థవంతంగా నిర్వర్తించడం అభినందనీయమని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు అన్నారు. శుక్రవారం స్థానిక పెన్నార్ పోలీసు హాలులో సన్నీ బాధ్యతా విరమణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పేలుడు పదార్థాలను గుర్తించడంలో నేర్పరిగా పేరున్న లాబ్రడార్ జాతికి చెందిన జాగిలం సన్నీని ఎస్పీ శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. సుదీర్ఘకాలం పోలీసుశాఖలో విధులు నిర్వర్తించి బాధ్యతా విరమణ సందర్భంలో కూడా సంపూర్ణ ఆరోగ్యంతో చురుగ్గా ఉండేలా కంటికి రెప్పలా చూసుకున్న హ్యాండ్లర్ ఎన్‌వీ సుధీర్‌రాజాని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. మున్ముందు కూడా జాగ్రత్తగా చూసుకోవాలని ఎస్పీ ఆకాంక్షించారు. జాగిలాలతో అనుబంధం భావోద్వేగాలతో కూడుకుని ఉంటుందంటూ పెంపుడు జాగిలంతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. సీఎం బందోబస్తు విధులు, వీవీఐపీ, వీఐపీ, క్రిష్ణా,గోదావరి పుష్కరాల్లో, తిరుమల బ్రహ్మోత్సవాల్లో సమర్థవంతంగా విధులు నిర్వహించి ప్రశంసలు పొందడం అభినందనీయమన్నారు. స్వాతంత్ర్య, రిపబ్లిక్ వేడుకల పెరేడ్‌లో ప్రదర్శన చేసి ప్రతిభ కనబరిచిందన్నారు. ఇటీవల సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా బందోబస్తు విధుల్లో, కౌంటింగ్ సెంటరు వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సమర్థవంతంగా విధులు నిర్వహించిందన్నారు. ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్ఎస్‌వీ క్రిష్ణారావు మాట్లాడుతూ 26.12.2012లో జన్మించిన సన్నీ ఏడాది పాటు శిక్షణ పొందిన అనంతరం 30.11.2013న జిల్లా పోలీసుశాఖలో సేవలను ప్రారంభించిందన్నారు. కార్యక్రమంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్పీ వెంకటరాముడు, ఏఆర్ డీఎస్పీ మురళీధర్, ఆర్ఐలు ఆనంద్, వీరేశ్, టైటస్, శ్రీశైలరెడ్డి, ఆర్ఎస్ఐలు స్వామినాయక్, వెంకటేశ్వర్లు, అప్పలనాయుడు, పావని, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం పవన్‌తో నేతల భేటీ



పవన్‌కల్యాణ్‌తో భేటీ అయిన నేతలు

రాజంపేట టౌన్, ఆగస్టు 23: డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌తో పలువురు నేతలు భేటీ అయ్యారు. రాజంపేట ఆర్అండ్‌బీ అతిథిగృహంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బాలిశెట్టి హరిప్రసాద్, సీనియర్ నేత అతికారి వెంకటయ్య, అతికారి కృష్ణ, దినేష్, మాజీ ఆర్టీసీ చైర్మన్ యెద్దల సుబ్బరాయుడు, జనసేన నేతలు యల్లటూరు శ్రీనివాస రాజు, యల్లటూరు శివరామరాజు, గీతాంజలి విద్యాసంస్థల అధినేత ఎస్వీ రమణ, జనసేన నేతలు నరసయ్య, తుంగా రమణయ్య, సుంకర శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

స్టాంప్‌రైటర్లే లంచాలు వసూళ్ళు చేస్తున్నారు

డిస్ట్రిక్ రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేసిన బాధితులు

ప్రొద్దుటూరు ఆగస్టు 23: సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అధికారులకు లంచాలు వసూలు చేస్తున్నదంతా స్టాంప్ రైటర్లేనని డిస్ట్రిక్ రిజిస్ట్రార్ బాబుకు కొందరు బాధితులు ఫిర్యాదు చేశారు. శుక్రవారం ప్రొద్దుటూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు జిల్లా రిజిస్ట్రార్ బాబు తనిఖీ నిమిత్తం వచ్చారు. ప్రొద్దుటూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులు కొందరు స్టాంప్ రైటర్ల ద్వారా లంచాలు తీసుకుంటున్నారన్నారు. స్టాంప్‌రైటర్ అజీజ్‌ను ఒక భూమి రిజిస్ట్రేషన్ విషయమై సంప్రదించగా సబ్ రిజిస్ట్రార్‌కు ఆఫీసు స్టాఫ్‌కు లంచాలు ఇవ్వాలని ఆ ఫీజు రూ.25 వేలు అవుతుందని తెలిపారని ఇందుకు తమ వద్ద సాక్ష్యాలు వున్నాయని లిఖిత పూర్వక ఫిర్యాదు అందజేశారు.

నేటి నుంచి అండర్-23 మల్టీడే క్రికెట్ మ్యాచ్‌లు

కడప (స్పోర్ట్స్) ఆగస్టు 23: నేటి నుంచి కడపలో సౌత్‌జోన్ అండర్-23 మల్టీడే క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహిస్తున్నట్లు క్రికెట్ సంఘం జిల్లా కార్యదర్శి అవ్వారు రెడ్డి ప్రసాద్ తెలిపారు. ఏసీఏ క్రికెట్ మైదానం, కేఎస్ఆర్ఎం, కేఓఆర్ఎం మైదానాల్లో శనివారం నుంచి సెప్టెంబర్ 11 వరకూ ఏసీఏ సౌత్‌జోన్ అండర్- 23 మెన్స్ మల్టీడే క్రికెట్ మ్యాచ్‌లు జరుగనున్నట్లు తెలిపారు. ఈమ్యాచ్‌లలో కడప, కర్నూలు, నెల్లూరు, చిత్తూరు, అనంతపురం, తదితర జట్లు పాల్గొంటున్నట్లు వెల్లడించారు.

విచారణ పేరుతో చితకబాదారు : ఎమ్మార్పీఎస్



సీఐతో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నేతలు

ముద్దనూరు ఆగస్టు23: హత్యకేసుకు సంబంధించి విచారణ పేరుతో దళితుడు సురేంద్రను సీఐ దస్తగిరి చితకబాదాడని ఎమ్మార్పీఎస్ నేతలు ఆరోపించారు. జిల్లాలోని అన్ని కేంద్రాల నుంచి ఎమ్మార్పీఎస్ నేతలు శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్ వద్దకు భారీ ఎత్తున తరలివచ్చి సీఐతో మాట్లాడారు. జిల్లా నేత విశ్వనాథ్ మాదిగ విలేకరులతో మాట్లాడుతూ వేల్పుచర్ల వాసి సురేంద్ర చిన్నాన్న కొడుకు నాగరాజు ఈ ఏడాది ఏప్రిల్ 24న మంగపట్నం సమీప రైల్వే పట్టాలపై మృతి చెంది పడిఉన్నాడు. ఎర్రగుంట్ల రైల్వే పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి ఈ నెల 4వతేదీన ముద్దనూరు పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. కాగా సీఐ దస్తగిరి కేసును తప్పుదారి పట్టించేందుకు విచారణ పేరుతో మృతుని కుటుంబ సభ్యులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. సురేంద్రను హత్యకేసు ఒప్పుకోమని హింసించారన్నారు. గతంలో మృతునికి డబ్బు ఇచ్చిన వారు కొట్టారని, వారిని వదిలేసి, దళితులను మాత్రమే పోలీసులు ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ఇప్పుడు పొరపాటు జరిగిందని తమకు సీఐ తెలియజేశారన్నారు. ఈవిషయమై ఎస్పీకి ఫిర్యాదు చేస్తామన్నారు. పోలీసులు హత్యకేసుకు సంబంధించి సమగ్ర విచారణ చేసి దోషులపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నేతలు పుల్లయ్యమాదిగ, రామకృష్ణమాదిగ, వెంకటేష్, గంగరాజు, చిన్నయ్య పాల్గొన్నారు.

నాగరాజు అనుమానాస్పద మృతి కేసులో సమగ్ర విచారణ చేస్తామని సీఐ దస్తగిరి అన్నారు. రైల్వే పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, బదిలీ చేశారు. మృతుని ఫోన్ కాల్ డేటాలో సురేంద్ర నంబర్ ఉండడంతో ఆయనను పిలిపించి విచారించామన్నారు.

డైట్ స్కూల్‌లో ఎల్ఈడీ టీవీ చోరీ

రాయచోటిటౌన్, ఆగస్టు23: స్థానిక డైట్ ఉన్నత పాఠశాలలో గురువారం రాత్రి ఎల్ఈడీ టీవీ చోరీకి గురైంది. పాఠశాల హెచ్ఎం నిర్మలాదేవి వివరాల మేరకు.. విద్యార్థుల సౌకర్యం ప్రభుత్వం సరఫరా చేసిన ఎల్ఈడీ టీవీని పాఠశాలలో ఏర్పాటు చేశారన్నారు. ఆ గది తాళం చెవులు వాచ్‌మెన్ వెంకట్రమణ, ఆయా రాజేశ్వరి, టీచర్ రాంప్రసాద్ వద్ద ఉన్నాయన్నారు. రోజూ పాఠశాల విధులు ముగించుకుని వాచ్‌మెన్ అన్ని గదులకు తాళాలు వేసుకున్న అనంతరం ఇండ్లకు వెళతామన్నారు. ఈ క్రమంలోనే గురువారం సాయంత్రం తాళాలు వేసుకుని వెళ్లామన్నారు. శుక్రవారం ఉదయం వాచ్‌మెన్ వచ్చి టీవీ చోరీకి గురైనట్లు తెలిపాడన్నారు. వెళ్లి చూడగా తరగతి గది తాళాలు పగలగొట్టి ఉన్నాయని, టీవీ చోరీకి గురైనట్లు గుర్తించామన్నారు. అర్బన్ సీఐ చంద్రశేఖర్‌కు ఫిర్యాదు చేసినట్లు హెచ్ఎం తెలిపారు.

అంతరిక్షరంగంలో భారత్ సరికొత్త చరిత్ర


ప్రొఫెసరు విశ్వనాధకుమార్

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 23: చంద్రయాన్3 విజయంతో భారతదేశం అంతరిక్షరంగంలో సరికొత్త చరిత్ర సృష్టించిందని వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్అండ్ ఫైన్ఆర్ట్స్ యూనివర్శిటీ వీసీ విశ్వనాధకుమార్ అన్నారు. శుక్రవారం ఏఎఫ్ఏయూలో జాతీయ అంతరిక్ష దినోత్సవం కెనరాబ్యాంకు సహకారంతో నిర్వహించారు. యూనివర్శిటీ ఏర్పాటు చేసిన చంద్రయాన్3 నమూనాను వీసీ ఆవిష్కరించారు. చంద్రుని సౌత్‌పోల్‌పై కాలుపెట్టిన తొలిదేశంగా భారత్ నిలిచిందన్నారు. ఎన్నో అభివృద్ధి చెందిన దేశాలకు సాధ్యం కానిది భారత్ ఘనతకు గుర్తుకుగా ఏటా ఆగస్టు 23న జాతీయ అంతరిక్ష దినోత్సవం నిర్వహిస్తున్నామని తెలిపారు. కెనరాబ్యాంకు అసిస్టెంటు జనరల్ మేనేజరు కె.మురళీమోహన్, భౌతికశాస్త్ర అధ్యాపకుడు ఫణీంద్రారెడ్డి, ఇన్‌ఛార్జ్ రిజిస్ట్రారు రాజేశ్‌కుమార్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంతరిక్ష పరిశోధనలతో జీవన ప్రయోజనాలు

సంబేపల్లె, ఆగస్టు23: అంతరిక్ష పరిశోధనలతో జీవన ప్రయోజనాలు మెరుగువుతున్నాయని జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్ రెడ్డి అన్నారు. స్థానిక జడ్పీహైస్కూల్‌లో నిర్వహించిన జాతీయ అంతరిక్ష దినోత్సవాల్లో ఆయన మాట్లాడుతూ చంద్రయాన్, ఆదిత్య వంటి అంతరిక్ష విజయాల ద్వారా ఇస్రో మానవ ప్రయోజనాలను మెరుగు పరుస్తోందన్నారు. భారత్ ఆన్ ది మూన్ డిజిటల్ లైబ్రరీ ద్వారా అంతరిక్ష ప్రయోగాల సమాచారాన్ని విద్యార్థులు, ఉపాధ్యాయులు అధ్యయనం చేశారన్నారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం చంద్రశేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

33 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

ప్రొద్దుటూరు అర్బన్, ఆగస్టు 23: ఇంట్లో అక్రమంగా నిల్వఉంచిన 33క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లయ్ ఆర్ఐ ప్రసాద్, వీఆర్ఓ రామచంద్రారెడ్డి తనిఖీ చేసి పట్టుకున్నారు. శుక్రవారం రాత్రి ఇంటి యజమాని రామక్రిష్ణను విచారించగా ఎండీయూ ఆపరేటర్ నుంచి కొనుగోలు చేశానన్నారు. పశువులకు పోషణ నిమిత్తం ఉంచుకున్నానని ఆయన తెలిపారు. బియ్యం స్వాధీనం చేసుకుని 4వ వార్డు రేషన్ డీలర్‌కు అధికారులు అప్పగించారు. కేసు నమోదు చేసి నివేదిక జేసీకి పంపనున్నట్లు తెలిపారు.

వరకట్న వేధింపులపై కేసు నమోదు

వేంపల్లె, ఆగస్టు 23: వేంపల్లె శ్రీరామ్‌నగర్‌కు చెందిన ప్రవళికపై ఆమె భర్త తిరుపతి పాకాలకు చెందిన జవర్‌హబాబు కట్నం కోసం వేధించినట్లు కేసు నమోదు చేసినట్ల సీఐ సురేష్‌రెడ్డి తెలిపారు. రెండేళ్ల కిందట పెళ్లి కాగా అదనపు కట్నం కోసం మానసిక, శారీరకంగా ఇబ్బందులు పెడుతుండడంతో భర్తపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

శభాష్ సాయి, ఓబులేసు



రివార్డు అందుకుంటున్న బ్లూకోల్ట్స్ సిబ్బంది

కడప (క్రైం), ఆగస్టు 23: అనాలోచితంగా ఉరేసుకోబోతున్న ఇంటర్ విద్యార్థినిని కాపాడిన బ్లూకోల్ట్స్ సిబ్బంది అధికారుల, ప్రజల మన్ననలు పొందారు. సెల్‌ఫోను అతిగా వాడొద్దని కుటుంబీకులు మందలించడంతో విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడబోయింది. అందిన సమాచారంతో బ్లూకోల్ట్స్ కానిస్టేబుళ్లు ఎ.సాయిగోపీనాథ్, ఓబులేసు విద్యార్థినిని కాపాడారు. ఎస్పీ హర్షవర్ధన్‌రాజు శుక్రవారం వారిని ప్రత్యేకంగా అభినందించి నగదు రివార్డులు అందించారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్పీ వెంకటరాముడు, ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్ఎస్ఎస్‌వీ క్రిష్ణారావు, కమాండ్ కంట్రోల్ ఇన్‌స్పెక్టరు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

33 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

8 మంది స్మగ్లర్లు అరెస్టు

రైల్వేకోడూరు(రూరల్) ఆగస్టు 23: బాలపల్లె అటవీ ప్రాంతం, తిరుపతి జిల్లా చంద్రగిరి అటవీ ప్రాంతంలో నిర్వహించిన దాడుల్లో 33 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకుని 8 మంది స్మగ్లర్లను అరెస్టు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఎస్పీ కే.శ్రీనివాస్ తెలిపారు. అన్నమయ్య జిల్లా బాలపల్లె, భాకరాపేట అటవీ ప్రాంతంలో ఆర్ఐ కృపానంద, ఆర్ఎస్ఐ అలీ బాషా టీమ్ సిద్దలేరు నుంచి కూంబింగ్ నిర్వహిస్తుండగా కొందరు అక్రమంగా ఎర్రచందనం దుంగలను మోసుకు వస్తూ కనిపించారు వారిపై దాడి చేసి ఆరుగురు తమిళనాడు వాసులను అరెస్టు చేసి 25 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. తిరుపతి జిల్లా చంద్రగిరి అటవీ ప్రాంతాల్లో ఆర్ఐ కే.సురేష్‌రెడ్డి, ఆర్ఎస్ఐ లింగాధర్ టీమ్ కూంబింగ్‌లో భాగంగా కారులో అక్రమంగా తరలిస్తున్న 7 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని విచారించి రైల్వే బ్రిడ్జి కింద ఒక ఎర్రచందనం దుంగను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు తమిళనాడు వాసులను అరెస్టు చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీస్ సిబ్బంది తెలిపారు.

ముగ్గురు మట్కా బీటర్లు అరెస్టు

ప్రొద్దుటూరు క్రైం, అగస్టు 23: వాస్తు కాంప్లెక్సు వద్ద ముగ్గురు మట్కా బీటర్లును అరెస్టు చేసినట్లు టుటౌన్ సీఐ యుగంధర్ తెలిపారు. మట్కా ఆడుతున్న మైఖేల్, గన్నా, చాంద్‌బాషను అరెస్టు చేసి వారి నుంచి 60000లు నగదు, స్లిప్పులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

గ్రామీణాభివృద్ధితోనే.. దేశాభివృద్ధి

● అన్ని పంచాయతీల్లో గ్రామసభలు

వీరబల్లి, ఆగస్టు 23: గ్రామాలు అభివృద్ధి చెందితే రాష్ట్ర, దేశం అభివృద్ధి చెందుతాయని రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం అన్నారు. శుక్రవారం వంగిమళ్ల గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. గ్రామ సభల ద్వారా ప్రజల అవసరాలను గుర్తించి, వాటిని సాధించడం కోసం ప్రణాళికలు రూపొందించుకుని గ్రామ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. 2021-25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టే అభివృద్ధి పనుల గుర్తింపు, ప్రణాళికా ప్రక్రియను రూపొందించుకునేందుకు గ్రామ సర్పంచ్ అధ్యక్షతన ప్రతి గ్రామపంచాయతీలో గ్రామ సభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతి కుటుంబానికి వంద రోజులు పని లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ సీయకులు తాటిగుట్ల శ్రీధర్‌రెడ్డి, పద్మనాభరెడ్డి కల్లూరి రాంమోహన్‌రెడ్డి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

రాయచోటిటౌన్: గ్రామీణ ప్రాంతాలను అన్ని రకాలుగా అభివృద్ధి చేయడం కోసమే గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు రాయచోటి మండల మాజీ ఉపాధ్యక్షుడు అనుంపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ప్రభుత్వ ఆదేశాల మేరకు రాయచోటి మండల పరిధిలోని 9 గ్రామ పంచాయతీల్లో అధికారులు గ్రామ సభలను నిర్వహించారు. శిబ్యాల గ్రామ పంచాయతీలోజరిగిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. పెమ్మాడపల్లిలో సర్పంచ్ పల్లపు వాసు, దిగువ అబ్బవరంలో ఎంపీడీవో మల్‌రెడ్డి, రాజంపేటపార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షులు గుర్రం సుబ్బయ్యనాయుడు, పెమ్మాడపల్లెలో ఈవోపీఆర్‌డీ సురేశ్‌బాబు మాట్లాడారు. మండల పరిషత్ పరిపాలన అధికారిణి కలీముల్లాబేగం, మాజీ సర్పంచ్ బసయ్య, వెలుగు సీసీ శ్రీనివాసరాజు, ఉపాధి టెక్నికల్ అసిస్టెంట్ శ్రీనివాసులు, గ్రామ పంచాయతీ కార్యదర్శి శివరలక్ష్మి, టీడీపీ నాయకులు నారాయణ రెడ్డి, జంగంరెడ్డి, గ్రామ ప్రజలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

రామాపురం: మండలంలోని 13 గ్రామ పంచాయతీల్లో ఆయా గ్రామాల సర్పచులు ఆధ్వర్యంలో ప్రత్యేక అధికారుల అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించారు. ఈ గ్రామ సభలో గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు, నీటి సమస్యలు, వీధి దీపాలు, ఉపాధి సంబంధించిన పనులను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల నుంచి అందిన అర్జీలను అధికారులు చదివి వినిపించారు. సర్పంచులు ధనలక్ష్మి, సరోజమ్మ, నాగభూషణ్ రెడ్డి, ఆంజనేయులు, మున్నీర్‌బాషా, టీడీపీ నాయకులు చంద్రమౌళి, రేఖం బ్రదర్స్ నారాయణ, ఆంజనేయులు, కొరివి ధనుంజయ, చిట్టి రెడ్డెయ్య, తిమ్మారెడ్డి, ఏనుగుల సుధాకర్, బాలకృష్ణ, కృష్ణ, గ్రామ ప్రత్యేక అధికారులు, గ్రామ కార్యదర్శులు సచివాలయ సిబ్బంది, ఉపాధి సిబ్బంది ప్రజలు, నాయకులు పాల్గొన్నారు.

సంబేపల్లె: మండల వ్యాప్తంగా 17 గ్రామ పంచాయతీల్లో స్వర్ణ గ్రామ పంచాయతీలకు ప్రణాళికలు సిద్ధం చేస్తామని మండల గ్రామ సభల ప్రత్యేక అధికారిణి తేజస్విని తెలిపారు. శుక్రవారం ఎంపీడీవో సునీల్‌కుమార్, తహసీల్దార్ వెంకటేశ్‌లతో కలిసి వేరు వేరుగా గ్రామసభలు నిర్వహించారు. సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వార్డు మెంబర్లు, ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు.

గాలివీడు: మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. ఎంపీడీవో శ్రీనివాసులు, టీడీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

సుండుపల్లి: మండల వ్యాప్తంగా 12 గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి శ్రీనివాసులు రెడ్డి, తహసీల్దార్ దైవాదీనం, ఎంపీడీఓ రామచంద్ర, ఏపీఓ మాలిక్ బాషా, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రసాద్, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు...

లక్కిరెడ్డిపల్లి: మండలంలోని 16 గ్రామ పంచాతీల్లో ప్రత్యేక అధికారి, గ్రామ సర్పంచుల ఆధ్వర్యంలో గ్రామ సభలు ఏర్పాటు చేశారు. అనంతపురం, లక్కిరెడ్డిపల్లె గ్రామాల్లో సర్పంచు అహల్య పాల్గొని లక్కిరెడ్డిపల్లెలో డ్రైనేజి సమస్యను వివరించారు. దిన్నెపాడు, పందిళ్లపల్లె, కాకుళవరం, కోనంపేట, బి యర్రగుడి, దప్పేపల్లె, ఈడిగ పల్లెలో తాగునీటి సమస్య పరిష్కరించాలని ప్రజలు వినతులు అందజేశారు. ఎంపీడీవో వెంకటరామిరెడ్డి, ఈవోపీఆర్‌డీ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పెనగలూరు: మండలంలోని 16 పంచాయతీల్లో గ్రామ సభలు జరిగాయి. మండల ప్రత్యేక అధికారి చెంగల్ రాయుడు పెనగలూరు గ్రామసభలో పాల్గొన్నారు. పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల జాబితాను గ్రామసభలో ప్రజలకు వినిపించారు. పెనగలూరు పంచాయతీ పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు గ్రామ కార్యదర్శి సుబ్బరాయుడు చదివి వివరించారు. గ్రామ ఉపసర్పంచ్ చిన్నవెంగల్‌రెడ్డి పాల్గొన్నారు. మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో ఐదు వారాలుగా కూలి అందలేదని, రెండు నెలలుగా పనులు కూడాలేక అవస్థలు పడుతున్నామని ఉపాధి హామీ కూలీలు సభ దృష్టికి తీసుకువచ్చారు.

నందలూరు: పాటూరులో ఈవోపీఆర్డీ సతీష్‌కుమార్, సర్పంచ్ అక్కిరెడ్డి స్వరూప, నాగిరెడ్డిపల్లెలో ఏవో ప్రకాష్, సర్పంచ్ జంబు సూర్యనారాయణ, నందలూరులో ఏపీవో డిల్లీ బాబు, సర్పంచ్ మోడపోతుల సుభాషిణి, ఆడపూరులో ఎంఈవో నాగయ్య, సర్పంచ్ చైతన్య భారతి, నల్లతిమ్మాయగారిపల్లెలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత, సర్పంచ్ గీతాల శిరీషా, లేబాకలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సునీత, లంకయ్యగారి వెంకటనరసయ్య, టీవీపురంలోని టి.మోహన్‌కృష్ణ, సర్పంచ్ లక్ష్మీదేవి, టంగుటూరులో పంచాయతిరాజ్ ఏఈ రవిశంకర్, సర్పంచ్ మైనుద్దీన్, మదనమోహనపురంలో హౌసింగ్ ఏఈ పవన్‌కళ్యాణ్, సర్పంచ్ చుక్కా నిర్మల, నూకినేని పల్లెలో ఎంపీడీవో సౌభాగ్యమ్మ, పొత్తపిలో అగ్రికల్చర్ ఆఫీసర్, మల్లికార్జున, సర్పంచ్ విజయ్‌కుమార్, మైసీ పల్లెలో ఏపీఎం వసుంధర, సర్పంచ్ మేడా రాజశేఖర్ రెడ్డి అధ్యక్షతన గ్రామసభలు జరిగాయి.

వీరబల్లి: మండలంలోని 12 గ్రామ పంచాయతీల్లో ఆయా గ్రామాల స్పెషలాఫీసర్లు, గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ మండలశాఖ అధ్యక్షుడు భానుగోపాల్‌రాజు ఎంపీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు సురేందర్‌రెడ్డి, తుమ్మల రమేశ్, ఆంజనేయులురెడ్డి, సర్పంచ్, ఎంపీడీవో మల్లీశ్వరి, స్పెషలాఫీసర్ అల్లాబకష్, మండల నాయకులు వీరనాగిరెడ్డి, ఇరు వర్గాల నాయకులు, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

చిన్నమండెం: 13 గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. మండల కేంద్రంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, కుప్పం పరిశీలకుడు గాజుల ఖాదర్‌బాషా మాట్లాడుతూ జగన్‌రెడ్డి ప్రభుత్వంలో గ్రామాల అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందన్నారు. 13 గ్రామ పంచాయతీల్లో మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తీర్మానం చేశారు. ఎంపీడీవో దివ్య, మండల, గ్రామ స్థాయి అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిట్వేలి: మండల పరిధిలోని 21 పంచాయతీల్లో గ్రామసభలు జరిగాయి. నాగవరంలో సర్పంచ్ కళావతితో కలిసి గ్రామసభలో పాల్గొన్న పంతగాని నరసింహ ప్రసాద్ మాట్లాడుతూ పార్టీలకతీతంగా గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా పంచాయతీలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ కోదండ నాయుడు, వైసీపీ మండల వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రమణ, టీడీపీ నాయకులు ప్రతాప్‌రెడ్డి, కూటమి నేతలు, సచివాలయ సిబ్బంది ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

సిద్దవటం: సిద్దవటం, బొగ్గుడివారిపల్లె గ్రామాల్లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బాలిశెట్టి హరిప్రసాద్, జనసేనపార్టీ రాజంపేట నియోజకవర్గ సీనియర్ నాయకులు అతికారి వెంకటయ్య, ఉమ్మడి కడపజిల్లా మాజీ తెలుగు ఉపాధ్యక్షుడు కుప్పాల వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు. మండల అభివృద్ధి అధికారి జవహర్‌బాబు, గ్రామ సర్పంచ్ బి.నాగరాణి, చంద్రకళ, ఎంఈవో అరుణ, ఏపీవో నరసింహులు, సర్పంచ్ ప్రతినిధి బి.ఓబులయ్య, పంచాయతీ సెక్రటరి రవశంకర్‌రెడ్డి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ, వైసీపీ నేతల వాగ్వాదం

ఒంటిమిట్ట : మండల వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామసభలను నిర్వహించారు. ఏపీవో శివశంకర్‌రెడ్డి, ఈవోపీఆర్డీ రంగయ్య, ఏఈ హరికృష్ణ టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. మండలంలోని సాలాబాద్ గ్రామ పంచాయతీలో నిర్వహించిన గ్రామసభలో టీడీపీ - వైసీపీ నాయకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. రాష్ట్ర అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేస్తున్న కృషి ని అధికారులు గ్రామసభలో ఎందుకు ప్రస్తావించడం లేదని టీడీపీ రాష్ట్ర లీగల్‌సెల్ సభ్యుడు అడ్వకేట్ రామ్‌దాస్ ప్రశ్నించారు. తమ గ్రామంలో ఆ అవసరం లేదని ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసుల రెడ్డి వ్యాఖ్యానించడంతో ఇరువురి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఎస్‌ఐ శివప్రసాద్ సంఘటన స్థలానికి చేరుకుని ఘర్షణ వాతావరణం చోటు చేసుకోకుండా ఇరువర్గాలకు సర్దిచెప్పారు.



వంగిమళ్ల గ్రామసభలో మాట్లాడుతున్న సుగవాసి



చిన్నమండెంలో మాట్లాడుతున్న గాజుల ఖాదర్‌బాషా

డిప్యూటీ సీఎం కోసం అభిమానుల ఎదురుచూపు



జనసేన అధినేత కోసం ఎదురు చూస్తున్న అభిమానులు

ఓబులవారిపల్లె, ఆగస్టు 23: గ్రామసభల్లో పాల్గొనేందుకు రాజంపేటకు వెళుతున్న జనసేన అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్‌ను చూసేందుకు అభిమానులు, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు ఓబులవారిపల్లె అడ్డ రోడ్డులో ఎదురు చూశారు. జనసేనపార్టీ నాయకులు ఆయనకు వేసేందుకు భారీ గజమాలను సిద్ధం చేశారు.

పవన్ కళ్యాణ్‌కు ఘన స్వాగతం



పవన్ కళ్యాణ్‌కు స్వాగతం పలుకుతున్న శివ ప్రసాద్

రైల్వేకోడూరు(రూరల్)ఆగస్టు 23: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మ కంగా చేపట్టిన గ్రామ సభలకు శుక్రవారం అన్నమయ్య జిల్లాకు విచ్చేసిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు రాజంపేట నియోజక వర్గ జనసేన సీనియర్ నాయకు డు చెంగారి శివ ప్రసాద్ తిరుపతి ఎయిర్‌పోర్ట్‌లో ఘన స్వాగతం పలికారు. కోడూరులో గ్రామసభ అనంతరం రాజంపేటలోని వరద ప్రాంతాలు మందపల్లి, పులపత్తూరు, తోగురుపేట ప్రాంతాల్లో బాధితులతో చర్చించి వారి సమస్యలను వివరించారు పంచాయతీ, అటవీశాఖకు సంబంధించిన పలు విషయాలను చర్చించినట్లు తెలిపారు. అన్ని సమస్యలు సానుకులంగా పరిష్కరిస్తామని పవన్ కళ్యాణ్ హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.


వైసీపీ నేతలు బీజేపీలో చేరిక



బీజేపీలో చేరిన వారితో సాయిలోకేష్, గడ్డం చెంగల్‌రాజు

ఓబులవారిపల్లె, ఆగస్టు 23: మండలం లోని పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీని విడిచి బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్, రైల్వే కోడూరు సమన్వయకర్త గడ్డం చెంగల్ రాజు సమక్షంలో బీజేపీలో చేరినట్లు పులపత్తూరు రామసుబ్బారెడ్డి తెలిపారు. కొర్లకుంట ఉప సర్పంచ్ ముక్కా రూపేష్‌రెడ్డి, గోవిందంపల్లె ఉపసర్పంచ్ జగదబి కేశవరాజు, ఓబులవారిపల్లె పంచాయతీకి చెందిన ఓబిలి రవీంద్రారెడ్డి, వేణు గోపాల్‌రెడ్డి, నరసారెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, సుమంత్‌రెడ్డి, శివారెడ్డి, సత్యరాజు, నాగేంద్ర, సుబ్రమణ్యంరాజు, నరేష్‌రాజు, నారాయణరాజు, కుమార్‌రాజు తదితరులు బీజేపీలో చేరినవారిలో ఉన్నారన్నారు. బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని రామసుబ్బారెడ్డి, కృష్ణయాదవ్ సూచించారని తెలిపారు.

రాజకీయ అవినీతి అత్యంత ప్రమాదకరం: సీపీఐ



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

రైల్వేకోడూరు(రూరల్) ఆగస్టు 23: ఆర్థిక అవినీతి కన్నా రాజకీయ అవినీతి అత్యంత ప్రమాదకరమని, ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలోకి రాజకీయ వలసలు సాగుతున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య విమర్శించారు. శుక్రవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయం వద్ద జిల్లా స్థాయి శిక్షణ తరగతులను ఆయనతోపాటు ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు తుమ్మల రాధాకృష్ణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పి.ఎల్. నర్సింహులు, సహాయ కార్యదర్శి మహేష్, జిల్లా కార్యవర్గ సభ్యుడు కృష్ణప్ప, సాంబశివ, జ్యోతి, చిన్నయ్య, సుమిత్రమ్మ, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షురాలు సరోజమ్మ, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి గంగాధర్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి జక్కుల వెంకటేష్, ఏఐటీయూసీ నాయకులు కృష్ణ చైతన్య పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు సత్కారం

నందలూరు, ఆగస్టు 23 : మండలంలోని నల్లతిమ్మాయగారి పల్లె పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసి ట్రిపుల్ ఐటీ ఇడుపుల పాయ, పీలేరు ఏపీఎస్‌ఆర్జేసీలో సీట్లు సాధించిన విద్యార్థులు మ ల్లికార్జున, జాషువాను శుక్రవారం అధ్యాపక బృందం సత్కరించింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయు రాలు రమణమ్మ మాట్లాడుతూ ఈ విద్యార్థులు పాఠశాలకు గర్వకారణమని అభినం దించారు. ఉపాధ్యాయులు నిత్య పూజయ్య, సిబువతుల్లా, వెంకటే శ్వర్లు, సాహిబ్‌జాన్, సరిత, చంద్రశేఖర్, ఈశ్వరయ్య భరత్‌కుమార్, అరుణ, రఘు ప్రకాష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పులపత్తూరులో వైద్యశిబిరం

రాజంపేట టౌన్, ఆగస్టు 23 : పులపత్తూరు గ్రామంలో శుక్ర వారం ఆకేపాడు ప్రాథమిక ఆరో గ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామసభ సందర్భంగా ఉప ముఖ్య మంత్రి వస్తున్న సందర్భంగా స్థా నిక ప్రజలకు ఉచిత వైద్య సేవ లు అందించారు. మందులు కూడా అందజేశారు. ప్రస్తుత సీజన్‌లో విషజ్వరాలు సోకుతుండడంతో అందరికి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చెన్నకృష్ణ, డాక్టర్ అశ్వనిచంద్, డాక్టర్ బ్రహ్మేంద్ర, సూపర్‌వైజర్ రవి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలకు ప్రత్యేక నిధులు మంజూరు చేయండి

వీరబల్లి, ఆగస్టు23: తీవ్ర వర్షాభావంలో భూగర్భజలాలు అడుగంటిపోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వీరబల్లి, సుండుపల్లె మండలాల ప్రజలు శుక్రవారం ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు వినతిపత్రం సమర్పించారు. నియోజకవర్గంలోని వీరబల్లి, సుండుపల్లె మండలాల్లో రహదారులు సరిగా లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన వీరబల్లి బేనీషా నిల్వ చేసుకోవడానికి కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చేయాలని కోరారు. వీరబల్లి నుండి గడికోట, మంటపంపల్లి మీదుగా రాజంపేటకు రహదారి ఏర్పాటు చేయాలన్నారు. సుండుపల్లె మండలంలోని పింఛా డ్యాం తెగిపోవడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం రాయలసీమ ప్రెసిడెంట్ మేకల దర్బార్‌బాషా, శేఖర్ పాల్గొన్నారు.

పోషకాహారంతో రక్తహీనత నివారణ

గాలివీడు, ఆగస్టు 23: సరైన పోషకా హారం, వైద్యుల సూచనలతో రక్తహీనత ను నివారించవచ్చునని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ నయాజ్ తెలిపారు. శుక్ర వారం మండలంలోని తూముకుంట గ్రామంలో అతేన సోలార్ వారు నిర్వహిం చిన కార్యక్రమంలో రక్తహీనత రాకుండా గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోషకాహారం, ఐరన్, ఫోలిక్ యాసిడ్ టాబ్లెట్ల గురించి వివరించి, పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం శైలజ, ఆశ కార్యకర్తలు, అంగన్వాడీ టీచర్లు, అతేనా సోలార్ మేనేజర్‌లు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ అంతరిక్ష దినోత్సవం

చిన్నమండెం, ఆగస్టు 23: మండలంలోని మల్లూరు జెడ్పీ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయుడు రెడ్డెన్న ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ అంతరిక్ష దినోత్సవం ఘనంగా నిర్వహించారు. చంద్రయాన్ ప్రయోగం విజయవంతమైన ఆగస్టు 23వ తేదీని భారత ప్రధాని నరేంద్రమోడీ జాతీయ అంతరిక్ష దినోత్సవంగా ప్రకటించడంతో ఈ వేడుక నిర్వహిస్తున్నట్లు విద్యార్థులకు వివరించారు. ఇలాంటి విజయాలని తెలుసుకున్నప్పుడే ఆసక్తిగా విద్యను అభ్యసించగలరన్నా రు.

టీడీపీ నేత రవీంద్రకు మాతృ వియోగం



కావుటూరు కృష్ణమ్మ(ఫైల్)

చిట్వేలి, ఆగస్టు 23 : మండల పరిధిలోని తిమ్మయ్యగారిపల్లెకు చెందిన టీడీపీ నాయకులు కావుటూరు రవీంద్ర మాతృవియోగం సంభవించింది. కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యతో బాధపడుతున్న ఆయన తల్లికావుటూరు కృష్ణమ్మ శుక్రవారం తుదిశ్వాస విడిచారు. శనివారం ఉదయం 10.30 గంటలకు తిమ్మయ్యగారిపల్లెలోని స్వగృహం వద్ద నుండి అంతిమ యాత్ర ప్రారంభమవుతుందని కుటుంబ సభ్యులు తెలిపారు.

పవన్‌కళ్యాణ్ పర్యటనలో అపశృతి

రాజంపేట టౌన్, ఆగస్టు 23 : రాజంపేటలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ పర్యటనలో అపశ్రుతి చోటు చేసుకుంది. రోడ్డు దాటుతున్న వృద్ధుడిని తప్పించబోయిన డిప్యూటీ సీఎం ఎస్కార్ట్ వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో రిజర్వు ఇన్‌స్పెక్టర్‌తో పాటు మహిళా కానిస్టేబుల్, డ్రైవర్ స్వల్పంగా గాయపడినట్లు తెలిసింది.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ఒంటిమిట్ట, ఆగస్టు 23 : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఉదయం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నారు. ప్రతి మూడు నెలలకు నిర్వహించనున్న ఈ సాధారణ సమావేశానికి ఎంపీపీ అక్కి లక్ష్మీదేవి అధ్యక్షత వహించనున్నారు. మండలంలోని అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని ఎంపీడీవో రెడ్డయ్య తెలిపారు.

రాయచోటి నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి

● డిప్యూటీ సీఎంను కోరిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, ఆగస్టు23: రాష్ట్రంలోనే అత్యంత వెనుకబడిన ప్రాంతమైన రా యచోటి నియోకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండి పల్లి రాంప్రసాద్‌రెడ్డి శుక్రవారం ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను కోరారు. రైల్వేకోడూరు, రాజంపేట నియోజకవర్గ పర్యటన సందర్భంగా డిప్యూటీ సీఎంతో కలిసి గ్రామసభలో పాల్గొన్నారు. అనంతరం రాయచోటి నియోజకవర్గంలో రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సమస్య పరిష్కరించాలని వినతిపత్రం సమర్పించారు. గతంలో రాయచోటి నియోజకవర్గంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉండేదని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సుమారు 20 బోర్లు వేసి నీటి సమస్య పరిష్కరించామన్నారు. నియోజకవర్గంలో రోడ్లు, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. రాయచోటి నియోజకవర్గ అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని ఉప ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు.

కుంభాభిషేక ఉత్సవంలో మంత్రి: మన్నేరువాండ్లపల్లెలో శుక్రవారం సాయంత్రం జరిగిన గుర్రప్పస్వామి ఆలయ కుంభాభిషేక ఉత్సవంలో మంత్రి మండిపల్లి పాల్గొన్నారు.

మంత్రికి ఘన స్వాగతం..

రైల్వేకోడూరు(రూరల్): మండలంలోని మైసూరివారిపల్లె పంచాయతీలో నిర్వహించిన గ్రామ సభకు విచ్చేసిన రాష్ట్ర రవాణా, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి రైల్వేకోడూరు నియోజకవర్గ టీడీపీ మైనారిటీ నేత పఠాన్ మౌలా ఘన స్వాగతం పలికారు. టీడీపీ సీనియర్ నాయకులు బాలిశెట్టి హరి రాయల్, రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు టంగుటూరు ప్రకాశం పంతులు



సంబేపల్లె టంగుటూరి ప్రకాశం పంతులుకు నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ దిలీప్‌కుమార్

నందలూరు, ఆగస్టు 23 : భారత స్వాతంత్ర్య ఉద్యమంలో చేరి తన న్యాయవాద వృత్తికి స్వస్తి పలికి, యావదాస్తిని దేశ సేవకే వినియోగించిన గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్రకేసరి టంగుటూరు ప్రకాశం పంతులు అని వక్తలు కొనియాడారు. మండలంలోని నాగిరెడ్డిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జి ప్రధా నోపాధ్యాయుడు శిల్పా ఆనందాచారి ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం ఆంధ్ర రాష్ట్ర ప్రథమ ముఖ్యమంత్రి టంగుటూరు ప్రకాశం పంతులు 153వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిం చారు.ఉపాధ్యాయులు గంగనపల్లి వెంకటరమణ, బోగా వెంకటసుబ్బయ్య, గొంటిముక్కల వెంకటరమణ, తులసి, స్వర్ణలత, గీత, రమణమ్మ, జ్యోతిప్రియ, గౌరి, ప్రమీల, రాహేల్, తదితరులు పాల్గొన్నారు.

సిద్దవటం : బాకరాపేట పోలీసు 11 బెటాలియన్‌లో కమాండెంట్ పి.రవిశంకర్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ డి.నాగేశ్వరప్ప, అసిస్టెంట్ కమాండెంట్ ఎం.థియోఫిలాస, ఆర్.విల్సన్‌కేర్, ఆర్‌ఎల్‌ఎస్, ఆర్‌ఎస్‌ఎల్‌ఎస్, ఏఆర్‌ఎస్‌ఎల్‌ఎస్, మెన్ పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

సంబేపల్లె: సైమన్ కమిషన్ వ్యతిరేకంగా చేసిన పోరాటంలో తుపాకీలను ఎదురొడ్డిన వీరుడు టంగుటూరి ప్రకాశం పంతులని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ దిలీప్‌కుమార్ తెలిపారు. సంబేపల్లె ఆదర్శ పాఠశాలలో టంగుటూరికి నివాళులర్పించారు.

వైసీపీ తొత్తులుగా వ్యవహరిస్తున్న అధికారుల తీరు మారాలి

ఒంటిమిట్ట, ఆగస్టు 23 : మండలంలో వైసీపీ తొత్తులుగా వ్యవహరిస్తున్న అధికారుల తీరు మారాలని టీడీపీ సీనియర్ నాయకులు అన్నారు. స్థానిక హరిత హోటల్‌లో వారు మాట్లాడుతూ మండలంలోని వైసీపీ నేతలు టీడీపీ నాయకులపై దౌర్జన్యం చేయాలని చూడడం బాధాకరమని సీనియర్ నాయకుడు కొమరా వెంకటనరసయ్య అన్నారు. టీడీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చొరవతో గ్రామాల అభివృద్ధి చేస్తుంటే సాలాబాదు గ్రామంలో అధికారులు అందుకు విరుద్ధంగా వ్యవహరించడంతోపాటు ప్రభుత్వ ప్రాధాన్యతలను ప్రజలకు వివరించకుండా వైసీపీ నేతల అడుగులకు మడుగులొ త్తుతున్నారని వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులుఅడ్వకేట్ రామదాస్, పామూరు సుబ్రమణ్యం, మామిళ్ల ఈశ్వరయ్య, మోదుగుల నరసింహులు, రేవిళ్ల బాలమునెయ్య, పత్తి కృష్ణ, మావిళ్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



కల్యాణ వేదికపై సీతారాములు

పెనగలూరు, ఆగస్టు 23: మండలంలోని పొందలూరు హరిజనవాడలో నిర్మించిన రామాలయంలో గురువారం రాత్రి గ్రామ పెద్దలు, యూత్ సభ్యులు భక్తి శ్రద్ధలతో కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం నూతన రథంలో ఉత్సవరులను ఘనంగా ఊరేగించారు. తీర్థ ప్రసాదాల పంపిణీ, అనంతరం అన్నదానం చేశారు.

కుప్పంలో ఎస్పీ తనిఖీలు



కుప్పం, ఆగస్టు 23: కుప్పం డీఎస్పీ కార్యాలయం, రాళ్ళబూదుగూరు పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం సాయంత్రం ఎస్పీ మణికంఠ తనిఖీ చేశారు. ఫిర్యాదుదారులతో మాట్లాడి, వారి సమస్యలు తెలుసుకున్నారు. త్వరితగతిన పరిష్కరించాలని ఎస్సైని ఆదేశించారు. స్టేషన్ నిర్వహణ, సిబ్బంది పనితీరు, కేసుల దర్యాప్తు, క్రైమ్ రికార్డులను పరిశీలించారు. కుప్పంలో బ్లాక్ స్పాట్‌లను పరిశీలించి రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డ్రంకెన్ డ్రైవ్, రోడ్డు భద్రతా నియమాలపై కళాశాలలు, పాఠశాలల్లో అవగాహనా సదస్సులు నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ పార్థసారథి, కుప్పం అర్బన్, రూరల్ సీఐలు జీటీ నాయుడు, మల్లేశ్ యాదవ్, రాళ్లబూదుగూరు ఎస్ఐ నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

కోలుకున్న విద్యార్థులు

● ఆరుగురికి వార్డులో, ముగ్గురికి ఐసీయూలో చికిత్స



చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

చిత్తూరు రూరల్, ఆగస్టు 23: చిత్తూరు అపోలో యూనివర్సిటీలో జరిగిన ఫుడ్‌పాయిజన్ ఘటనలో బాధిత విద్యార్థులు కోలుకున్నారు. గురువారం కూడా 200 మందికి పైగా వార్డుల్లో చికిత్స పొందుతున్నారు. శుక్రవారానికి 9 మంది మినహా మిగిలిన వారందరు డిశ్చార్జ్ అయ్యారని అపోలో యూనిట్ హెడ్ నరేశ్‌రెడ్డి తెలిపారు. ఆరుగురు వార్డులో, ముగ్గురు ఐసీయూలో చికిత్స తీసుకుంటున్నారు. వీరి ఆరోగ్యం నిలకడగా ఉందని శనివారం డిశ్చార్జ్ చేస్తామని తెలిపారు. ఫుడ్ పాయిజన్ ఘటనతో భయందోళనకు గురైన విద్యార్థులకు అందులో నుంచి బయట పడడానికి నాలుగు రోజులు పాటు సెలవులు ప్రకటించారు. దీంతో అనేక మందికి విద్యార్థులు ఇళ్లకు వెళ్లారు. కిచెన్, మెస్‌ను ప్రక్షాళన చేస్తున్నట్లు నరేశ్‌రెడ్డి తెలిపారు. కాగా, గురువారం తిరుపతి స్విమ్స్ నుంచి వచ్చిన రాపిడ్ రెస్పాన్స్ టీం సేకరించిన నమూనాలకు సంబంధించి రిపోర్టు 48 గంటలు తర్వాత వస్తుందని డీఎంహెచ్‌వో ప్రభావతి దేవి తెలిపారు. శుక్రవారం కూడా మరికొందరి విద్యార్థుల మోషన్ సేకరించినట్లు ఆమె చెప్పారు.

మేటిమందలో పిచ్చికుక్క వీరంగం

పలువురికి గాయాలు



సోమల, ఆగస్టు 23: సోమల మండలం ఇరికిపెంట పంచాయతీ మేటిమందలో పిచ్చి కుక్క వీరంగం సృష్టించింది. శుక్రవారం దారి పోతున్న పలువురిని కాటు వేసింది. మేటి మందకు చెందిన వెంకట్రమణ, గంగిరెడ్డిపల్లె శంకర్, మంజుల, డ్యాంవద్ద బాబు, బంగ్లా పెద్దోడు తదితరులను గాయపరిచింది. బాధితులను సదుం ప్రభుత్వ వైద్యశాలకు, మరి కొందరిని పీలేరు ప్రభుత్వ వైద్యశాలకు మాజీ సర్పంచు శ్రీనివాసులునాయుడు, వై.మోహన్ నాయుడు తరలించారు.

నక్షత్ర తాబేలు, నాటు తుపాకీ స్వాధీనం

● ఒకరి అరెస్టు



అటవీ అధికారుల అదుపులో నిందితుడు అంకయ్య

పుంగనూరు, ఆగస్టు 23: నక్షత్ర తాబేలు, నాటు తుపాకీ కలిగి ఉండడంతో మండలంలోని నేతిగుట్లపల్లె పంచాయతీ షికారీపాళ్యానికి చెందిన అంకయ్యను అటవీ అధికారులు అరెస్టు చేశారు. అటవీశాఖ అధికారి శ్రీరాములు కథనం మేరకు.. అంకయ్య(65) ఇంట్లో నక్షత్ర తాబేళ్లు ఉన్నట్లు సమాచారం రావడంతో వెంటనే సిబ్బందితో వెళ్లి తనిఖీ చేపట్టారు. అట్టపెట్టెలో ఒక నక్షత్ర తాబేలు, నాటు తుపాకీని గుర్తించి అతడిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి చిత్తూరులో జడ్జి ఎదుట హాజరుపరిచారు. ఈ దాడుల్లో పుంగనూరు అటవీశాఖ అధికారులు రాకేశ్‌కుమార్, కిరణ్‌కిషోర్, రాజశేఖర్, శోభనాద్రి, యువరాజ్, శ్రీనివాసులు, రాధమ్మ పాల్గొన్నారు.

నేడు డివిజన్ స్థాయిలో వర్క్ అడ్జస్ట్‌మెంట్

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 23: మండల స్థాయిలోని ప్రభుత్వ, జెడ్పీ, ఎంపీపీఎస్ పాఠశాలల్లో వర్క్ అడ్జస్ట్‌మెంట్ పూర్తయిన నేపథ్యంలో శనివారం డివిజన్ స్థాయి ప్రక్రియ చేపట్టేందుకు విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. డివిజన్ స్థాయి సర్‌ప్లస్ టీచర్లు కొద్ది మంది మాత్రమే ఉన్న క్రమంలో జాబితా ఆన్‌లైన్‌లో రాగానే గంటల వ్యవధిలో పూర్తి చేసేందుకు డివిజన్ ఇన్‌చార్జులు సిద్ధమయ్యారు.

విద్యుదాఘాతంతో ట్రాన్స్‌కో ఫీల్డ్ అసిస్టెంట్ మృతి



వాసు (ఫైల్ ఫొటో)

విజయపురం, ఆగస్టు 23: విద్యుదాఘాతంతో ట్రాన్స్‌కో కాంట్రాక్టు ఫీల్డు అసిస్టెంట్ మృతి చెందిన ఘటన మండలంలోని పన్నూరులో శుక్రవారం చోటుచేసుకుంది. నగరి రూరల్ మిట్టపాళెంకు చెందిన వాసు(30) ట్రాన్స్‌కోలో కాంట్రాక్టు పద్ధతిన ఫీల్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. పన్నూరులోని ఓ రైతు పొలంలో విద్యుత్ తీగలను మరమ్మతు చేస్తుండగా షాక్ కొట్టడంతో స్తంభం నుంచి కింద పడ్డాడు. గ్రామస్థులు వెంటనే నగరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. గొల్లకండ్రిగ వద్ద లైన్ క్రాసింగ్ వల్ల ఈ ప్రమాదం జరిగిందని ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు.

బైక్‌తో గోతిలో పడి వ్యక్తి మృతి



గోతిలో పడి మృతిచెందిన తమిళనాడువాసి

గుడిపాల, ఆగస్టు 23: బైక్‌తో సహా గోతిలో పడి వ్యక్తి మృతిచెందిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసులు చెప్పిన వివరాల మేరకు.. తమిళనాడు రాష్ట్రం వేలూరు జిల్లా అరక్కోణంకు చెందిన వేలాయుధం ఈనెల 21వ తేదీన కుమార్తెను చిత్తూరు అపోలో కళాశాలలో చేర్పించాడు. తిరిగి వస్తుండగా చిత్తూరు-వేలూరు జాతీయ రహదారిలోని చిత్తూరు రూరల్ మండలం గోపాలపురం సమీపంలో నేషనల్ హైవే అధికారులు రోడ్డు పనుల నిమిత్తం తీసిన గోతిలో బైక్‌తో సహా పడ్డాడు. తీవ్ర గాయాలతో అక్కడే మృతిచెందాడు. గమనించిన స్థానికులు చిత్తూరు తాలుకా పోలీసులకు సమాచారం అందించారు. వారు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీసి, పరిశీలించి తమిళనాడు వాసిగా గుర్తించారు. చిత్తూరు తాలుకా ఎస్ఐ రమేష్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

యాక్సిల్ విరిగింది..టైరు పంక్చరైంది

కారు అదుపు తప్పి ఇద్దరికి స్వల్ప గాయాలు



వెదురుకుప్పం, ఆగస్టు 23: కార్వేటినగరం బంగారమ్మ ఆలయ సమీపంలో వెనుక యాక్సిల్ విరిగి, టైర్ పంక్చర్ కావడంతో కారు అదుపు తప్పింది. స్థానికుల వివరాల మేరకు.. శుక్రవారం సాయంత్రం చిత్తూరు నుంచి కారులో ఆరుగురు కార్వేటినగరం మీదుగా ఊతుకోటకు వెళ్తుండగా బంగారమ్మ ఆలయ సమీపంలో గోడను ఢీకొంది. ఇందులో నలుగురు పెద్దలు, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి.

బాలికకు లైంగిక వేధింపులు

చిత్తూరు, ఆగస్టు 23: చిత్తూరు నగరం వెంగళరావు కాలనీకి చెందిన ఓ వ్యక్తి బాలికను లైంగిక వేధింపులకు గురి చేస్తున్నట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. ఇతడు నగరంలోని ఓ మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. తరచూ ఆమె ఇంటికెళుతూ 14 ఏళ్ల కుమార్తెను లైంగికంగా వేధించడం మొదలుపెట్టాడు. బంధువుల ఫిర్యాదు మేరకు నిందితుడిని రెండో పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకుని, విచారిస్తున్నట్లు సమాచారం.

రోడ్డు కుంగి.. డ్రైనేజీలో పడి..!

● కౌలాలంపూర్ ప్రమాదంలో గల్లంతైన కుప్పం మహిళ



కుప్పంలోని ఆమె కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల, పీఎస్ఎం



23కేపీయం 45-విజయలక్ష్మి (ఫైల్ ఫొటో)



కౌలాలంపూర్‌లోని ప్రమాద స్థలం

కుప్పం, ఆగస్టు 23: కుప్పం పట్టణం అనిమిగానిపల్లెకు చెందిన జి.పళని కుమార్తె విజయలక్ష్మి, మలేసియా రాజధాని కౌలాలంపూర్‌లో ప్రమాదానికి గురయ్యారు. ఆమె రోడ్డుమీద నడుస్తుండగా హఠాత్తుగా రోడ్డు కుంగింది. రోడ్డు కిందనున్న మురుగునీటి కాలువలో ఆమె పడిపోయినట్లు కుప్పంలోని కుటుంబ సభ్యులకు సమాచారమందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, నియోకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పీఎస్. మునిరత్నంలు శుక్రవారం విజయలక్ష్మి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రమాదానికి గురైన విజయలక్ష్మిని రక్షించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబుతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు. టీడీపీ నాయకులు ఆర్ముగం, గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

దోపిడీ కేసులో ఐదుగురి అరెస్టు



నిందితులను చూపుతున్న డీఎస్పీ, సీఐ తదితరులు

కుప్పం, ఆగస్టు 23: శాంతిపురం మండలంలో జూన్ 6వ తేదీన ఒక ఇంట్లో జరిగిన దోపిడీ కేసులో ఐదుగురు నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ పార్థసారథి తెలిపారు. కుప్పంలోని తన కార్యాలయంలో శుక్రవారం రూరల్ సీఐ మల్లేశ్ యాదవ్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఆయన తెలిపిన ప్రకారం.. శాంతిపురం మండలం కొలమడుగు పంచాయతీ తోపుచేను గ్రామానికి చెందిన హెచ్.షర్మిళ ఇంట్లో జూన్ నెల 6వ తేది రాత్రి 11.50 గంటల సమయంలో ఐదుగురు దుండగులు చొరబడ్డారు. ముఖాలకు ముసుగులు, చేతులకు గ్లవ్స్ వేసుకుని ఉన్నారు. షర్మిళను కాళ్లు చేతులు కట్టేసి, అరవకుండా నోటిని చున్నీతో మూసేశారు. ఆమె మెడలోని బంగారు చైను, వరండాల్లో ఉంచిన ద్విచక్ర వాహనం దొంగతనం చేసుకుని పారిపోయారు. ఈ దోపిడీపై ఆమె రాళ్లబూదుగూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కుప్పం రూరల్ సీఐ మల్లేశ్ యాదవ్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. సాంకేతిక ఆధారాలతో పరిశోధన సాగింది. శుక్రవారం ఉదయం శాంతిపురం మండలం దండికుప్పం వద్ద పోలీసులు తనిఖీ చేస్తుండగా ద్విచక్ర వాహనాలపై అనుమానస్పదంగా వెళ్తున్న కొందరిని ఆపి ప్రశ్నించారు. ఈ విచారణలో షర్మిళ ఇంట్లో దోపిడీ చేసినవారిని పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. నిందితులైన శాంతిపురం మండలం దండికుప్పం పంచాయతీ సిద్దారెడ్డపల్లె గ్రామానికి చెందిన ఎస్.వెంకటేశ్, కొలమడుగు పంచాయతీ వేటగిరికొత్తూరు గ్రామానికి చెందిన ఎ.కుమార్, తమిళనాడు రాష్ట్రం వేలూరు జిల్లా అనికెట్టు తాలూకా పోయిగై గ్రామానికి చెందిన ఎం.కార్తీక్, పిల్లియర్ గ్రామానికి చెందిన ఎం.మోహన్‌రాజ్, మార్చంబట్టు గ్రామానికి చెందిన ఎస్.శాంతకుమార్‌ను అరెస్టు చేశారు. నిందితులను కోర్టు ముందు హాజరు పరిచి రిమాండుకు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు.

వి.కోట బైపాస్ రోడ్డు అలైన్‌మెంట్ మార్పులో అవకతవకలు

క్షేత్ర పరిశీలనలో కలెక్టర్‌కు జేఏసీ నేతల ఫిర్యాదు



వి.కోట బైపాస్‌లో జరిగిన అవకతవకలను కలెక్టర్, ఎమ్మెల్యేకు వివరిస్తున్న జేఏసీ నేతలు

వి.కోట, ఆగస్టు 23: వి.కోటకు మంజూరైన బైపాస్ రోడ్డు అలైన్‌మెంట్ మార్పులో అవకతవకలు జరిగాయని కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు జేఏసీ నేతలు ఫిర్యాదు చేశారు. శుక్రవారం ఎమ్మెల్యే అమరనాథరెడ్డితో కలసి క్షేత్రస్థాయి పరిశీలనకు వచ్చిన కలెక్టర్‌కు బైపాస్ రోడ్డు తూర్పున కాకుండా, కర్ణాటక మీదుగా వేయడం వల్ల ప్రయోజనం లేదని స్థానికులు వివరించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో కొంతమంది రియల్టర్ల స్వప్రయోజనాల కోసం హైవే అధికారులు లేని దూరాన్ని డీపీఆర్‌లో చూపి నిర్మాణ వ్యయం ఎక్కువ చేసి తూర్పు బైపాస్ అలైన్‌మెంట్ కాకుండా కర్ణాటక మీదుగా బైపాస్ రోడ్డు వేసేలా అలైన్‌మెంట్ మార్చారని ఆరోపించారు. దీనిపై గతంలో 45 రోజుల పాటు మండల ప్రజలు ఉద్యమించి 7 వేల సంతకాలు సేకరించి పంపితే పట్టించుకోలేదని వివరించారు. అప్పటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత సీఎం చంద్రబాబు సైతం రెండు హైవేలు కలిసేలా బైపాస్ రోడ్డు నిర్మించాలని కేంద్రమంత్రికి రాసిన లేఖను ఆయనకు అందజేశారు. తూర్పు వైపున బైపాస్ అందుబాటులోకి వస్తే 9 పంచాయతీల మీదుగా వెళ్తుతుందని, ఏడు గ్రామీణ రహదారులు, రెండు హైవేలు కలసి ట్రాఫిక్ పట్టణంలోకి రాకుండా అటునుంచే వెళ్లే అవకాశం ఉంటుందని టీడీపీ నేతలు కలెక్టర్‌కు వివరించారు. కర్ణాటక మీదుగా రోడ్డు వల్ల ఏదైనా ప్రమాదం జరిగితే కోలారుకు వెళ్ళాల్సి వస్తుందని మండల టీడీపీ అధ్యక్షులు రంగనాథ్ అభ్యంతరం తెలిపారు. నెర్నపల్లె వద్ద రియల్టర్ల భూమిని కాపాడేందుకు రోడ్డు గ్రామం మధ్యలో వెళ్లేలా మార్పులు చేయడంతో ఇళ్ల కోల్పోవాల్సి వస్తుందని గ్రామస్థులు అభ్యంతరం తెలిపారు. దీనిపై హైకోర్టును ఆశ్రయించి స్టే తెచ్చామన్నారు. ఇక, రామకుప్పంలో కార్గో ఎగుమతుల నిమిత్తం ఎయిర్‌పోర్టు అందుబాటులోకి వస్తే తూర్పు బైపాస్ అనువుగా ఉంటుందని ఏఎంసీ మాజీ ఛైర్మెన్ రామచంద్రనాయుడు ఆయనకు వివరించారు. తూర్పు బైపాస్ కావాలని 18 పంచాయతీలు, మండల పరిషత్ ఏకగ్రీ రాత్మానాలు చేసినా పట్టించుకోకుండా, భూసేకరణ పూర్తి కాకుండా టెండరు ప్రక్రియ పూర్తి చేయడంలో అంతర్యమేమిటని హైవే అధికారులను స్థానికులు ప్రశ్నించారు. అలైన్‌మెంట్ మార్పులో అవకతవకలు జరిగాయని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లామని కలెక్టర్‌కు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి వివరించారు. దీనిపై విచారించి బాధ్యులపై చర్యలు తీసుకుని తూర్పు వైపే బైపాస్ నిర్మాణం జరిగేలా చూడాలని కోరారు. దీనిపై జాతీయ రహదారుల శాఖ ఈఈని వివరణ కోరగా అప్పటి ప్రభుత్వ పెద్దల ఆదేశాల మేరకు మార్పులు జరిగినట్లు చెప్పే ప్రయత్నం చేశారు. అధికారుల సమాధానంపై కలెక్టర్ సుమిత్‌కుమార్ అసహనం వ్యక్తం చేశారు. ఖచ్చితంగా తూర్పు వైపే బైపాస్ వచ్చేలా ముఖ్యమంత్రితో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని ప్రజలకు హామీ ఇచ్చారు.

ఇద్దరి ఆత్మహత్యాయత్నం

● వివాహేతర సంబంధమే కారణం



చికిత్స పొందుతున్న రాధిక, సతీష్

చంద్రగిరి, ఆగస్టు 23: చంద్రగిరి మండలం శ్రీవారిమెట్టు మార్గంలో ఇద్దరు పురుగుల మందు ఆత్మహత్యకు యత్నించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చిత్తూరు మండలం బంగారెడ్డిపల్లె ఎస్టీ కాలనీకి చెందిన విజయ్, రాధిక(25)కు ఆరేళ్ల కిందట క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. అయితే రాధిక అదే గ్రామానికి చెందిన సతీష్(19)తో వివాహేతర సంబంధం పెట్టుకుంది. మూడ్రోజుల కిందట రాధిక, సతీష్‌లు ఇళ్ల నుంచి పరారయ్యారు. అప్పటినుంచి కుటుంబీకులు గాలిస్తున్నారు. శుక్రవారం ఉదయం వీరిద్దరూ తిరుమల శ్రీవారి దర్శనం చేసుకుని శ్రీవారి మెట్టు మార్గం ద్వారా శ్రీనివాసమంగాపురానికి బయల్దేరారు. ఈ సమయంలో రాధిక తన పిల్లలతో మాట్లాడాలని భర్తకు ఫోన్ చేసింది. అతడికి అనుమానం వచ్చి తన బంధువులతో కలిసి శ్రీవారిమెట్టు మార్గానికి చేరుకున్నారు. శ్రీవారిమెట్టు మార్గంలో 800 మెట్టు సమీపంలో రాధిక, సతీష్‌లు కిందకు దిగుతూ నీరసంగా కనిపించారు. విజయ్ తన భార్య వద్దకొచ్చి పురుగుల మందు తాగి ఉందన్న విషయాన్ని తెలుసుకుని.. అక్కడే వాంతులు చేయడానికి ప్రయత్నించాడు. అనంతరం ఆమెను తన భుజాన వేసుకుని, సతీష్‌ను మరో వ్యక్తి భుజాన వేసుకుని శ్రీవారిమెట్టు వద్దకు చేరుకున్నారు. తర్వాత 108 వాహనంలో వీరిద్దరినీ చికిత్స నిమిత్తం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందించాక వారిద్దరి ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. దీనిపై చంద్రగిరి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

హత్యాచారాన్ని నిరసిస్తూ ర్యాలీ



ఆర్టీసీ బస్టాండు వద్ద మానవహారంగా నిలబడిన విద్యార్థులు

కుప్పం, ఆగస్టు 23: కోల్‌కత్తాలోని ఆర్‌జి కర్ ఆస్పత్రిలో జూనియర్ డాక్టరుపై జరిగిన హత్యాచారాన్ని నిరసిస్తూ శుక్రవారం కుప్పం డిగ్రీ కళాశాల విద్యార్థులు ర్యాలీ చేశారు. ఆర్టీసీ బస్టాండు కూడలిలో మానవహారం ఏర్పాటు చేశారు. మహిళలపై జరుగుతున్న దాడులను ఖండించారు. మళ్లీమళ్లీ ఇటువంటి హత్యాచార ఘటనలు జరుగకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 'ఉయ్ వాంట్ జస్టిస్' అంటూ ప్లకార్డులు చేతపట్టి నినాదాలు చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డి.సుధారాణి, మహిళా సాధికారత సెల్ కో ఆర్డినేటర్ ఆశ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జమ్మికుంట చెరువు దురాక్రమణపై సీసీఎల్ఏ విచారణకు ఆదేశం

చౌడేపల్లె, ఆగస్టు23: జమ్మికుంట చెరువు ఆక్రమణపై సీసీఎల్ఏ విచారణకు ఆదేశించినట్లు సెంటర్ ఫర్ ఆక్స్ అండ్ రైట్స్ డెవలప్‌మెంట్ సొసైటీ వ్యవస్థాపకులు ఉత్తరాది హరిప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ చౌడేపల్లెకు చెందిన వైసీపీ నాయకులు మాజీ ఎంపీపీ రెడ్డిప్రకాష్, చౌడేపల్లె సర్పంచ్ వరుణ్ కుటుంబసభ్యులు జమ్మికుంటను చెరువును ఆక్రమించారన్నారు. దీనిపై ఆగస్టు 8న మంగళగిరిలోని చీఫ్ కమిషన్ ఆఫ్ ల్యాండ్ అడ్మిస్ట్రేషన్ క మిషనర్‌కు ఫిర్యాదు చేశానన్నారు. స్పందించిన కమిషనర్ చెరువు దురాక్రమణపై విచారణ చేసి నివేదికలు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారని వివరించారు.

హత్యాయత్నం కేసులో ఐదుగురి అరెస్ట్

గంగవరం, ఆగస్టు 23: టీడీపీ వాణిజ్య విభాగ రాష్ట్ర కార్యదర్శి రఘుచంద్ర గుప్తాపై జరిగిన హత్యాయత్నం ఘటనలో ఐదుగురిని అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ ప్రసాద్ తెలిపారు. నిందితుల్లో బైరెడ్డిపల్లె మాజీ ఎంపీపీ శ్రీనివాసులురెడ్డి, కోలార్‌కు చెందిన కానిస్టేబుల్ వినాయకం కూడా ఉన్నారు. సీఐ తెలిపిన ప్రకారం.. బైరెడ్డిపల్లె మండలం లక్కనపల్లెకు చెందిన రఘుచంద్రగుప్తా కారును ఈనెల 19వ తేది రాత్రి గంగవరం మండల పరిధిలోని మినీ లారీతో ఢీకొట్టి హత్యాయత్నానికి పాల్పడిన విషయం తెలిసిందే. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. హత్యాయత్నంకు పాల్పడిన బైరెడ్డిపల్లె మండలం వైసీపీకి చెందిన మాజీ ఎంపీపీ శ్రీనివాసులు రెడ్డి, కోలారులో ఐడిపార్టీ కానిస్టేబులు వినాయకం, ముళబాగిల్‌కు చెందిన మినీ లారీ డ్రైవర్ అస్లాం, ముళబాగిల్ తాలూకా కన్నసంద్రం గ్రామానికి చెందిన శీనప్ప, మునెప్పను గురువారం రాత్రి అరెస్ట్ చేశారు. వీరు ఉపయోగించిన మినీ లారీ, కారును సీజ్ చేశారు. నిందితులను కోర్టులో హాజరు పరచినట్లు సీఐ తెలిపారు. కాగా, రాజకీయంగా రఘుచంద్రగుప్తా తనకంటే పైకి ఎదుగుతుండటంతో శ్రీనివాసులురెడ్డి ఓర్వలేక కోలారుకు చెందిన కానిస్టేబుల్‌కు సుపారీ ఇచ్చి హతమార్చాలని ప్రయత్నించినట్లు నిందితులు విచారణలో అంగీకరించారని తెలిసింది.

పైన గాజులు.. లోపల మద్యం



గాజులపెట్టెలో మద్యం అమ్ముతూ పట్టుబడ్డ సుబ్రమణ్యం

గంగవరం, ఆగస్టు 23: గాజులమ్మ గాజులో.. అంటూ గ్రామాల్లో అరుస్తూ బైకుపై వస్తాడాయన. ఆడవాళ్లంటే గాజులు చూపించేవాడు. అదే మగాళ్లకు బాక్సులో గాజుల కింద ఉంచిన కర్ణాటక మద్యం అమ్మేవాడు. ఇలా గాజులు అమ్ముతున్నట్లు నటిస్తూ కర్ణాటక మద్యం విక్రయిస్తున్న సుబ్రమణ్యంను శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. ఇతడిది గంగవరం మండలం నల్లసానిపల్లె గ్రామం. కొన్నిరోజులుగా గాజులు వ్యాపారం చేస్తున్నట్లు నటిస్తూ కర్ణాటక సరిహద్దు నుంచి గంగవరం మండలంలోని పలు గ్రామాల్లో తిరుగుతుండేవాడు. ఇదే రూట్‌లో తిరుగుతూ ఆడవాళ్లకు గాజులు అమ్ముతూ, మగవాళ్లకు కర్ణాటక మద్యం విక్రయిస్తూ సులభంగా సొమ్ము చేసుకొనేవాడు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచి తనిఖీలు చేపట్టారు. ఉయ్యాలమిట్ట గ్రామం నుంచి గడ్డిండ్ల రోడ్డులో తనిఖీలు నిర్వహించగా గాజులమ్ముతున్నానని పోలీసులను బురిడీ కొట్టించడానికి ప్రయత్నించాడు. పోలీసులకు అనుమానం వచ్చి తనిఖీలు చేయగా గాజుల బాక్సుల కింద టెట్రా మద్యం ప్యాకెట్లు బయటపడ్డాయి. సుబ్రమణ్యంను అరెస్టు చేసి.. 432 టెట్రాప్యాకెట్లు, ద్విచక్రవాహనాన్ని సీజ్ చేసినట్లు గంగవరం అర్బన్ సీఐ ప్రసాద్ తెలిపారు.

ఇంట్లో చోరీ

144 గ్రాముల బంగారం, రూ.1.75 లక్షల నగదు అపహరణ



ఇంటి తాళాన్ని పగులగొట్టిన గుర్తు తెలియని వ్యక్తులు

యాదమరి, ఆగస్టు 23: ఇంట్లో ఎవరూ లేని సమయంలో తాళాలు పగులగొట్టి బంగారం, నగదును చోరీ చేసిన ఘటన మండలంలోని ఎర్రచేను గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన సురేంద్ర, సుధారాణి దంపతులు ఊరికి దూరంగా ఇల్లు కట్టుకుని ఉంటున్నారు. గురువారం బంగారుపాళ్యం మండలం మొగిలీశ్వర స్వామి ఆలయంలో బంధువుల పెళ్లి ఉండటంతో వెళ్లి ఆ రోజు రాత్రి అక్కడే ఉన్నారు. శుక్రవారం ఉదయం ఇంటికి వచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉంది. బీరువాలో ఉన్న రూ.10 లక్షల విలువ చేసే 144 గ్రాముల బంగారం, రూ.1.75 లక్షల నగదు కనిపించలేదు. బాధితుల ఫిర్యాదు మేరకు వెస్ట్ సీఐ శ్రీనాథ్ నాయుడు ఆధ్వర్యంలో క్లూస్ టీము అక్కడికి చేరుకుని ఆధారాలు సేకరించింది.

పంచాయతీల సమగ్రాభివృద్ధే లక్ష్యం

● పీలేరు గ్రామసభలో ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి ● రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గ్రామ సభలకు అపూర్వ స్పందన



పీలేరు గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి



ములకలచెరువు గ్రాసభలో పాల్గొన్న టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా



కలికిరిలో మాట్లాడుతున్న ఎంపీడీవో గంగయ్య

పీలేరు, ఆగస్టు 23:గ్రామ పంచాయతీల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం గ్రామసభలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోందని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. పీలేరు గ్రామ పంచాయతీలో శుక్రవారం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 2024-25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టబోయే పనులను గుర్తించేందుకు నిర్వహించిన గ్రామసభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ స్థానిక సంస్థలను అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పంచాయతీల్లో గ్రామసభలు ఏర్పాటు చేసి ఆయా పంచాయతీల అభివృద్ధి కోసం కావాల్సిన పనులు గుర్తిస్తున్నారన్నారు. వారిద్దరి ఆదేశాల మేరకు రాష్ట్రంలోని ప్రజాప్రతినిధులందరూ గ్రామసభల్లో పాల్గొంటున్నారని తెలిపారు. అనంతరం ఆయన సభకు హాజరైన మహిళలను వారి ప్రాంతాల్లోని సమస్యలు తెలపాలని విజ్ఞప్తి చేశారు. తమ ప్రాంతంలో పంచాయతీ నీటి సరఫరా సరిగ్గా జరగడం లేదని స్థానిక ఆర్టీసీ నల్లగుట్ట, దిల్‌షాద్ నగర్‌లోని మహిళలు తెలిపారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జి కావాలని రాజీవ్ నగర్ కాలనీ మహిళలు విజ్ఞప్తి చేశారు. కావలిపల్లెలోని అంగన్‌వాడీ కేంద్రం శిథిలావస్థకు చేరుకుందని, దానిని తొలగించి కొత్త భవనం నిర్మించాలని ఆ ప్రాంత మహిళలు కోరారు. సమస్యలన్నింటినీ వారం రోజుల్లో పరిష్కరిస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు.

పీలేరు పంచాయతీని మున్సిపాలిటీగా మారుస్తాం!

దినదినాభివృద్ధి చెందుతున్న పీలేరు గ్రామ పంచాయతీని త్వరలోనే మున్సిపాలిటీగా మారుస్తామని ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి వెల్లడించారు. పదేళ్ల క్రితమే పీలేరును మున్సిపాలిటీగా మార్చాల్సిందని, పన్నులు ఎక్కువగా ఉంటాయన్న భయంతో ఆపివేశామన్నారు. పీలేరు సమీపంలోని కొన్ని గ్రామాలను కలుపుకుని గ్రేటర్ పీలేరు మున్సిపాలిటీని ఏర్పాటు చేసే ఆలోచన చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ సర్పంచ్ జీనత్ షఫీ, మండల ప్రత్యేక అధికారి ప్రసన్న, ఎంపీడీవో ఉపేంద్ర రెడ్డి, తహసీల్దారు భీమేశ్వర రావు, పంచాయతీ కార్యదర్శి గురుమోహన్, టీడీపీ నాయకులు కోటపల్లె బాబు రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, పురం రామ్మూర్తి, పోలిశెట్టి సురేంద్ర, లడ్డూ జాఫర్, లక్ష్మీకర, చరణ్ రెడ్డి, అతిఖా షఫీ, మల్లి, షౌకత్ అలీ, చాను, శివ, రియాజ్, ఖాదర్, ముబారక్, సూరి, రమణారెడ్డి, వసంతాలా రాజా, మహమ్మద్ పీర్, సలీం, మనోహర్, రెడ్డమ్మ, స్వర్ణ, రెడ్డిరాణి, సాధన, రమా దేవి, లక్ష్మీకాంతమ్మ, షమ, ఖాజాపీర్, భాస్కరరెడ్డి, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే గ్రామసభలు

తంబళ్లపల్లె, ఆగస్టు 23: గ్రామాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం గ్రామసభలను ఏర్పాటు చేసిందని పశుసంవర్ధక జేడీ, ప్రత్యేకాధికారి గుణశేఖర్‌పిళ్లై అన్నారు. శుక్రవారం మండలంలోని అన్ని పంచాయతీలలో ఆయా ప్రజాప్రతినిధులు, మండల అధికారులు, కూటమి నాయకుల ఆధ్వర్యంలో స్వర్ణ గ్రామ పంచాయతీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలల్లో సిమెంటు రోడ్ల నిర్మాణం, మురుగునీటి కాలువలు, వీధి దీపాలు, మరుగుదొడ్ల నిర్మాణాలు వంటివి చేపట్టాలని కూటమి నాయకులు, స్థానిక ప్రజలు అధికారులకు వినతి పత్రాలు అందచేశారు. కార్యక్రమాల్లో ఎంపీడీవో సురేంద్రనాథ్, ఏపీవో అంజినప్ప, కూటమి నాయకులు పాల్గొన్నారు.

నిమ్మనపల్లిలో: మండలంలోని పది గ్రామ పంచాయతీలలో శుక్రవారం గ్రామ సభలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి ప్రసాద్, ఇన్‌చార్జి ఎంపీడీవో రమేష్‌లు మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం గ్రామ పంచాయతీలను సర్ణగ్రామ పంచాయతీలు చేసేందుకు గ్రామ పంచాయతీలలో నెలకొన్న సమస్యలను గుర్తి ంచి వాటిని పరిష్కరించేందుకు ఉపాధి హామీని అనుసంధానం చేసిందన్నారు. అనంతరం ప్రజల నుంచి దరఖాస్తుతీసుకోగా అందులో ఎక్కువగా సీసీరోడ్లు, విద్యుత్, మురుగునీటికాలువల నిర్మాణం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీవో రమేష్, కార్యదర్శులు మారెప్ప, వెంకటరమణారెడ్డి, సరస్వతి, రాజష్‌లతో పాటు సర్పంచులు పాపులమ్మ, రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

ములకలచెరువులో: మండలంలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభల్లో పలు సమస్యలపై ప్రజలు అర్జీలు అందజేశారు. మండలంలోని చౌడసముద్రంలో జరిగిన గ్రామసభకు టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు చెన్నకిష్టా, నాయీ బ్రాహ్మణ సాధికార సమితి కన్వీనర్ కేశవులు తదితరులు హాజరయ్యారు. అలాగే దేవళచెరువు, సోంపల్లె గ్రామాల్లో జరిగిన గ్రామసభల్లో టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, ఎర్రగుడి సురేష్‌లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీ సిగి నరసింహులు, నాయకులు గుత్తా సుధాకర్‌నాయుడు, బుర్రా రమణ, శేఖర్‌నాయుడు, చాంద్‌బాషా, తంబళ్ల శివన్న, రమణారెడ్డి, నాగేంద్ర, చలపతి, ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దమండ్యంలో: మండలంలోని 17 గ్రామ పంచాయతీ శుక్రవారం ఉపాధి గ్రామసభలు జరిగియి. తహసీల్దార్ సయ్యద్ అహ్మద్, సర్పంచులు నటరాజ్‌నాయక్, బాషా, బయ్యారెడ్డి, పద్మావతి, విజయకుమారి, గంగులమ్మ, సరస్వతి, పీరాన్‌బీ ఎంపీటీసీలు రుక్మాంగదరెడ్డి, జయచంద్ర కూటమి నేతలు సిద్దవరం ప్రసాద్, శంకర, ప్రభాకరరెడ్డి, దత్తాత్రేయరెడ్డి, కుంటకింద పల్లి చంద్రారెడ్డి, రఘునాథరెడ్డి, బావాజీ, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గుర్రంకొండలో:పల్లెలు అభివృద్ధి చెందడానికే రాష్ట్ర ప్రభుత్వం గ్రామ సభలను నిర్వహిస్తోందని టీడీపీ మండల అధ్యక్షుడు నాయినిజగదీష్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో గ్రామసభలను నిర్వహించారు. అన్ని గ్రామాల్లో అభివృద్ధికి అవసరమైన పనులను గుర్తించి అమలు చేయాలని ప్రజలు అధికారులకు వినతి పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశులు, సర్పంచ్ లలిత, ఆనంద్, రామలక్ష్మమ్మ, నాయకులు ఎల్లుట్ల మురళీ, నౌషాద్‌అహ్మద్, చలమారెడ్డి, సుంకర శేఖర్, చంద్రబాబు, ప్రకాశ్, బయ్యారెడ్డి, సాగర్, క్రాంతి, జయసూరి, నాగేంద్ర, మహత్మారెడ్డి, సుధాకర్, రెడ్డెప్పరెడ్డి, రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

కలకడలో: మండలంలోని 16 పంచాయతీలలో శుక్రవారం జరిగిన గ్రామసభల్లో ప్రజల నుంచి ప్రజాప్రతినిధులు, అధికారులు అర్జీలను స్వీకరించారు. ఆయా గ్రామాల్లో ముఖ్యంగా రోడ్లు, మురుగునీటి కాలువలు, వీధి దీపాలు, తాగు నీటి పైప్‌లైన్, ఉపాధి పనులకు సంబంధించి ప్రజల నుంచి అర్జీలు వచ్చినట్లు ఎంపీడీవో పరమేశ్వరరెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా జాతీపిత మహాత్మాగాంధీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో మద్దిపట్ల వెంకట్రామయ్యచౌదరి, అలివేలమ్మ, నాగరాజునాయుడు, లక్ష్మీప్రసన్న, విశ్వనాథ్, శివప్రసాద్, వెంకటరమణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో: బి.కొత్తకోట మండలంలోని 15 గ్రామపంచాయతీలలో శుక్రవారం ఉపాధిహామీ గ్రామసభలు ప్రశాంతంగా ముగిశాయి. అన్ని పంచాయతీలలో ప్రత్యేక అధికారులు ఆయా పంచాయతీ కార్యదర్శుల సహకారంతో గ్రామ సభలను నిర్వహించారు. ఎంపీడీవో శంకరయ్య కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సభలలో సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులతో పాటు అధికార కూటమి నాయకులు పాల్గొని గ్రామంలో అత్యవసరంగా చేపట్టాల్సిన రోడ్లు, డ్రైనేజి లాంటి మౌలికసదుపాయాల గురించి చర్చించారు. మండలంలోని గట్టు గ్రామసభలో తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నాయకుడు జయచంద్రారెడ్డి, బీరంగి గ్రామసభలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పర్వీన్‌తాజ్ పాల్గొన్నారు.

కురబలకోటలో: గ్రామాల్లో ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పిస్తామని ఎంపీడీవో హరినారాయణ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని అన్ని పంచాయతీలలో ఉపాధి గ్రామసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు, అభివృద్ధి ప్రణాళికలను సభలో చర్చించారు.

కలికిరిలో 421 పనులకు ఆమోదం

కలికిరి, ఆగస్టు 23: మండలంలో ఉపాధి పనుల గుర్తింపు కోసం శుక్రవారం 14 గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించి మొత్తం 421 పనులను ఆమోదించారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరైన ఈ గ్రామ సభలో 421 పనుల కోసం ప్రజల నుంచి దరఖాస్తులు అందినట్లు ఎంపీడీవో గంగయ్య, ఏపీవో సుజాత తెలిపారు. వాటన్నింటికీ అంచనాలు తయారు చేసి మంజూరు కోసం ప్రతిపాదనలు సిద్ధం చేస్తామని చెప్పారు. ఇంకా ముఖ్యమైన పనులేవైనా ఉంటే ప్రజల అవసరాలనుబట్టి ప్రతిపాదనలు స్వీకరిస్తామన్నారు.

మదనపల్లె అర్బన్‌లో: మండలంలోని కొండామరిపల్లె, కోళ్లబైలు 1. గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన గ్రామ సభలో టీడీపీ ఇన్‌చార్జి శ్రీనివాసులు నాయుడు, నాయకుడు జావీద్ అక్బరీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఆధ్వర్యంలో పంచాయతీల్లో మంచి నీటి సౌకర్యాం, రోడ్ల నిర్మాణాలు, డ్రైనేజ్ సమస్యల పరిష్కారానికి శ్రీకారం చుట్టారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పాతీమునిషా, ఆనంద రెడ్డి, ఉప స్పంచ్ నాగరాజ, టీడీపీ ఇన్‌చార్జి జయరామ్, రూరల్ అధ్యక్షుడు రమణ, పీఆర్ స్పెషల్ ఆఫీసర్ రమణ, హౌసింగ్ డీఈ దీనదయాల్, ఎంపీటీసీ అరుణ, ఏఎస్‌వో సురేష్, బైలునాయుడు పాల్గొన్నారు.



బి.కొత్తకోట గ్రామసభలో మాట్లాడుతున్న జయచంద్రారెడ్డి



మాట్లాడుతున్న పర్వీన్‌తాజ్



కలకడ గ్రామసభలో మాట్లాడుతున్న అధికారులు



తంబళ్లపల్లెలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి

అక్రమ కేసుల నుంచి విముక్తి కల్పించండి

● మంత్రి లోకేశ్‌కు టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు సురేంద్రయాదవ్ వినతి



మంత్రి లోకేశ్‌ని కలిసిన బీసీ నేత సురేంద్రయాదవ్

కురబలకోట, ఆగస్టు 23: గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తంబళ్లపల్లె నియోజకవర్గానికి చెందిన పలువురు టీడీపీ నేతలపై అక్రమ కేసులు బనాయించారని ఆ కేసుల నుంచి విముక్తి కల్పించి న్యాయం చేయాలని ఐటీ, విద్యాశాఖామంత్రి నారా లోకేశ్‌ను రాజంపేట పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు పి.సురేంద్రయాదవ్ కోరారు. మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో ఆయనను కలిసి నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిస్థితులను మంత్రి లోకేశ్ అడిగి తెలుసుకున్నారన్నారు. పార్టీ కోసం కష్టపడిన వారికి గుర్తింపు ఇవ్వడంతో పాటుగా వారికి అన్ని విధాలా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. తంబళ్లపల్లె నియోజకవర్గ అభివృద్ధికి పూర్తిగా దృష్టి సారిస్తానన్నారు. అలాగే కేసుల నుంచి విముక్తితో పాటుగా, నామినేటెడ్ పదవుల్లో న్యాయం చేస్తానని హామీ ఇచ్చారన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తమ నియోజకవర్గంలో పర్యటించాలని కోరగా, త్వరలోనే పర్యటిస్తామని చెప్పారన్నారు.

కోళ్లబైలు పంచాయతీలో అభివృద్ధి శూన్యం

●గ్రామసభలో టీడీపీ నాయకుల ధ్వజం



కోళ్లబైలు-2 పంచాయతీలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

మదనపల్లె టౌన్, ఆగస్టు 23: మదనపల్లె మండలంలో వైసీపీ సర్పంచ్‌లు ఉన్న గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి శూన్యమని టీడీపీ నాయకులు ధ్వజమెత్తారు. శుక్రవారం మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లో స్వర్ణపంచాయతీ గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా కోళ్లబైలు-2 గ్రామానికి విడుదలైన రూ.48 లక్షల ఉపాధి నిధులను ఖర్చు పెట్టడంలో వైసీపీ సర్పంచ్ విఫలమయ్యారని టీడీపీ నాయకుడు శ్రీనివాసులు తదితరులు ఆరోపించారు. దీనికి వైసీపీ నాయకులు విరుద్ధంగా సమాధానం చెప్పడంతో కొద్దిసేపు సభలో గందరగోళం ఏర్పడింది. చివరికి అధికారులు సర్దిచెప్పడంతో వాగ్వాదాలు చల్లారాయి. గ్రామ సభలో ప్రజల వ్యక్తిగత అవసరాలు, సామాజిక అవసరాలు, వీధిదీపాలు, రోడ్లు, మురుగునీటి కాలువల సమస్యలు పరిష్కరించాలని అర్జీలు వెల్లువెత్తాయి. వీటన్నింటి మినిట్స్‌బుక్‌లో నమోదు చేసుకున్న అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో భానుప్రసాద్, తహసీల్దార్ ఖాజాబీ, ఏపీవో సుబ్రమణ్యం తదితర అధికారులు పాల్గొన్నారు.

పశువులకు సకాలంలో టీకాలు వేయించాలి

●రాయితీ గోకులాలను సద్వినియోగం చేసుకోండి
● జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ గుణశేఖర్ పిళ్లై

తంబళ్లపల్లె, ఆగస్టు 23: పశువులకు సకాలంలో టీకాలు వేయించడం వలన వ్యాధినిరోధక శక్తి లభిస్తుందని, పాడి రైతులు ఆపోహలు వీడి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పక వేయించాలని జిల్లా పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకుడు గుణశేఖర్ పిళ్లై సూచించారు. శుక్రవారం గ్రామసభలకు ప్రత్యేకాధికారిగా వచ్చిన జేడీ అన్నగారిపల్లె పశువైద్య కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ...ప్రతి పాడి రైతు ఆపోహలు వీడి పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలన్నారు. ప్రభుత్వం ఈ టీకా కార్యక్రమాన్ని ఉచితంగా ఏడాదికి రెండు సార్లు చేపడుతోందన్నారు. ఈ నెల 20 నుంచి సెప్టెంబరు 18 వరకు జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో పశు వైద్య సిబ్బంది బృందాలుగా ఏర్పడి గాలి కుంటు నివారణ టీకా కార్యక్రమం చేపడుతారన్నారు. జిల్లా వ్యాప్తంగా 3,45,400 టీకాలు వేయడం లక్ష్యం కాగా..ఈ మూడు రోజుల్లో 27 వేల టీకాలు వేసినట్లు తెలిపారు. అదేవిధంగా, పెయ్యదూడల్లో వ్యాధినిరోధక శక్తి పెంపు, బలమైన ఎదుగుదలకు జీవితాంతం వ్యాధుల బారిన పడకుండా జాతీయ బ్రుసెల్లోసిస్ టీకా కార్యక్రమాన్ని ఏడాదికి మూడు విడతలుగా చేపడుతోందన్నారు. 4 నుంచి 8 నెలల లోపు పెయ్యదూడలకు బ్రుసెల్లోస్ టీకాలు వేస్తారన్నారు. మొదటి విడతలో 15వేలు డోసులు వేసినట్లు తెలిపారు.

ఉపాధి పథకం ద్వారా 90శాతం రాయితీతో గోకులాలు

ప్రభుత్వం పాడి రైతులను ప్రోత్సహిస్తూ ఉపాధి హామీ పథకం ద్వారా 90 శాతం రాయితీతో గోకులాలను మంజూరు చేస్తోందని వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జేడీ కోరారు. జిల్లాలో 18 కరువు మండలాలకు ఒక్కో మండలానికి 50 యూనిట్ల చొప్పున 900 గోకులాలు, 12 కరువు రహిత మండలాలకు ఒక్కో మండలానికి 25 యూనిట్ల చొప్పున 300 గోకులాలు మంజూరులో ఉన్నాయన్నారు. సొంత భూమి రెండు ఆవులు కలిగిన పాడి రైతులకు ఒక్కో యూనిట్‌కు రూ.1.15లక్షలు, 4 ఆవులకు రూ.1.85లక్షలు, 6 ఆవులకు రూ.2.30లక్షలు నిధులు ప్రభుత్వం ఇస్తుందన్నారు. అర్హులైన, ఆసక్తి కలిగిన పాడి రైతులు పశువైద్య కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సురేంద్రనాథ్, సిబ్బంది ఉన్నారు.

ఘనంగా టీడీపీ నేత బాబురెడ్డి జన్మదిన వేడుకలు



బాబురెడ్డి జన్మదినవేడుకలు నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

మదనపల్లె అర్బన్, ఆగస్టు 23: మండలంలోని గంగన్నగారిపల్లెకు చెందిన టీడీపీ నేత గంగారపు బాబురెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక చిత్తూరు బాస్టాండ్ సమీపంలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం పార్టీ శ్రేణులు కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు అన్నదానం చేశారు. జనసేన రాయలసీమ కన్వీనర్ గంగారపు రాం దాస్ చౌదరి, ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాల శివరాం, టీడీపీ సీని యర్ నేతలు నాదెళ్ల రామన్న, పణీకర్‌రెడ్డి, రంగస్వామి నాయుడు లైన్స్‌క్లబ్ పీఆర్వో గాంగారపు గౌతమ్ రెడ్డి, టీడీపీ నాయకులు నారాయణస్వామి, నటశేఖర్, రామ్మోహన్ నాయుడు, సింగల్ విండో మాజీ డైరెక్టర్ వెంకటరమణ బాబురెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

విద్యాసంస్థల బస్సుల్లో భద్రతా ప్రమాణాలు పాటించాలి

మదనపల్లె టౌన్, ఆగస్టు 23: విద్యాసంస్థల బస్సుల నిర్వహణలో వాటి యజమానులు భద్రతా ప్రమాణాలు పాటించాలని ఎంవీఐ శివలింగయ్య, దినేష్‌చంద్ర సూచించారు. శుక్రవారం స్థానిక రవాణాశాఖ కార్యాలయంలో విద్యాసంస్థల యజమానుల సమావేశంలో అధికారులు మాట్లాడుతూ డ్రైవింగ్ లైసెన్సు ఉన్న డ్రైవర్లనే విధుల్లోకి తీసుకోవాలని, బస్సుల్లో తప్పని సరిగా ఫస్ట్‌ఎయిడ్ కిట్లు, అగ్నిమాపక పరికరాలు సిద్ధంగా ఉంచాలన్నారు. ఓవర్ స్పీడు, సామర్థ్యానికి మించి విద్యార్థులను బస్సులో ఎక్కిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. పాఠశాలల విద్యార్థులను బస్సు ఎక్కించేటప్పుడు, దించేటప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. బస్సులో తప్పని సరిగా ఒక సహాయకుడు ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంవీఐ శ్రీహరి, విద్యాసంస్థల యజమానులు పాల్గొన్నారు.

దాతల సహకారం మరువలేనిది

కలకడ, ఆగస్టు 23:పాఠశాల అభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారం మరువలేనిదని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ మలాంషావలి అన్నారు. మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులకు పది లీటర్ల పెరుగును ప్రతి రోజు రాతిగుంటపల్లె సర్పంచ్ అలివేలమ్మ అందిస్తున్నారన్నారు. అలాగే శుక్రవారం విద్యార్థులకు పాఠశాల కమిటీ ఛైర్మన్ రమేష్‌నాయుడు, వైస్ ఛైర్మన్ రిజ్వానా అక్బర్‌లు స్వీట్లు, అరటి పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో మునీంద్ర నాయక్, టీడీపీ నాయకులు వెంకటరమణనాయుడు, వసంతనా యుడు, పీవినాయుడు, ఇనాయతుల్లా, రఫీలు పాల్గొన్నారు.

మత్తు మందులు నిబంధనల మేరకు విక్రయించండి



పీపీ యూనిట్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్

మదనపల్లె టౌన్, ఆగస్టు 23: ఔషధాలు విక్రయించే దుకాణాల్లో షెడ్యూల్ హెచ్1 రకం, మత్తు మందులు ప్రభుత్వ నిబంధనల మేరకు విక్రయించాలని డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ కేశవరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సర్వజన బోధనాస్పత్రిలో పీపీ యూనిట్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పై తెలిపిన మందులు విక్రయించేటప్పుడు తప్పని సరిగా వైద్యుడు రాసిచ్చిన ప్రిస్క్రిప్షన్ వుండాలని, దాని జిరాక్స్ కాపి తీసుకుని, వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు.అనంత రం పీపీ యూనిట్‌కు కేంద్రప్రభుత్వ సరఫరా చేసిన వివిధ రకాల వ్యాక్సిన్‌ల ఎక్స్‌పైర్ తేదీలను పరిశీలించారు. పీపీ యూనిట్ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు ఉచిత కంటి వైద్యశిబిరం

మదనపల్లె టౌన్, ఆగస్టు 23: మదనపల్లె జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో ఆదివారం నిర్వహించే కంటి ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కరస్పాండెంట్ ఆర్.గురు ప్రసాద్ కోరారు. శ్రీవేంకటేశ్వర అరవింద్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించే ఈ శిబిరానికి హాజరయ్యేవారు వివరాలకు 73308 68914 ఫోన్ చేయాలని కోరారు.

మినీ లారీని ఢీకొన్న లారీ.. తప్పిన ప్రమాదం

ములకలచెరువు, ఆగస్టు 23: ముంబాయి - చెన్నై జాతీయ రహదారి పక్కన ఆగిన మినీ లారీని వెనుక నుంచి వచ్చిన మరో లారీ ఢీకొనడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. మినీ లారీ అదుపు తప్పి జనాలవైపు దూసుకెళ్లడంతో పలువురు తప్పించుకున్నారు. ఈ ఘటనలో రోడ్డు పక్కన నిలిపిన రెండు ద్విచక్ర వాహనాలు మినీ లారీ కింద పడి నుజ్జునుజ్జయ్యాయి. స్థానికులు కథనం మేరకు...ములకలచెరువు బస్టాండు సర్కిల్‌లో శుక్రవారం జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా ఇనుప బ్యారీకేడ్లను మినీ లారీలో వేసుకుని అవసరమైన చోట దింపి రోడ్డు కిరువైపులా వేస్తున్నారు. ఈ క్రమంలో కదిరి నుంచి మదనపల్లె వైపు వెళ్తున్న లారీ రోడ్డు పక్కన ఆపిన మినీ లారీని వెనుక వైపు నుంచి ఢీకొంది. దీంతో మినీ లారీ అదుపు తప్పి జనాలవైపు దూసుకెళ్లి రోడ్డు పక్కన బోల్తా పడింది. ఈ సమయంలో అక్కడున్న జనం పరుగులు తీయడంతో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. ప్రతి శుక్రవారం వారపు సంత జరుగుతుండడంతో జన సంచారం ఎక్కువగా ఉంటుంది. లారీ ఢీకొన్న సమయంలో మినీ లారీలో డ్రైవర్ కూడా లేకపోవడంతో అదృష్టవశాత్తు పెద్ద ప్రమాదమే తప్పినట్లయ్యింది. అదుపు తప్పిన మినీ లారీ కిందపడి రోడ్డు పక్కన నిలిపిన రెండు ద్విచక్రవాహనాలు నుజ్జునుజ్జయాయ్యియి. అక్కడున్న విద్యుత్ స్తంభం కూడా నేలకొరిగింది. ఆ సమయంలో కరెంటు సరఫరా లేకపోవడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి ఘటనపై విచారణ చేపట్టారు.

పీఅండ్‌టీ కాలనీలో ఓ హోటల్ వద్ద ఉద్రికత్త

మదనపల్లె అర్బన్, ఆగస్టు 23: పట్టణంలోని పీఅండ్‌టీ కాలనీలో ఓ హోటల్ వద్ద శుక్రవారం కొందరు వ్యక్తులు గొడవ చేయంతో ఉద్రిక్తత నెలకొంది. దీంతో విషయం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌కు వెళ్లడంతో పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని సర్దుమణిచారు. స్థానిక పట్టణం ఎగువ కురవంకకు చెందిన కవిత అనే మహిళ 30 మంది వద్ద మూడు కోట్లు వరకు అప్పు చేసి పరారైయిందని అక్కడికి వచ్చిన బాధితులు తెలిపారు. గత నాలుగు నెలల క్రితం తాలుకా పోలీసులు కవితతో మాట్లాడి బాధితులకు గడువు ప్రకారం అప్పు చెల్లించే విధంగా ఒప్పించారని కాని గడువు మించిపోవడం కవితా ఊళ్లో లేదని తెలియడంతో ఆమె భర్త చిన్నోడు నడుపుతున్న హోటల్ వద్దకు బాధితులు వెళ్లి హోటల్‌ను మూసేశారు. ఈ సందర్భంగా చిన్నోడు వన్‌టౌన్ సీఐతో మాటాడుతూ కవితతో విడాకులు పొందానని, ఆమె ఎక్కడుందో తెలియదని, తాను చిన్న పిల్లలను పోషించుకుంటూ హోటల్ నడుపుతున్నాని తెలిపారు. ఇప్పటికే చాలా సార్లు నా హోటల్‌ను బంద్ చేసిన కారణంగా తాను తీవ్రంగా నష్టపోతున్నట్లు అతను పేర్కొన్నాడు. ఈ విషయంగా సీఐ చాంద్‌బాషా మాట్లాడుతూ చిన్నోడిపై దాడి, గొడవ చేయరాదని ఏమైనా ఉంటే కోర్టు ద్వారా చర్యలు తీసుకోవాలని బాధితులకు చెప్పి అక్కడి నుంచి పంపించి వేశారు.

బి.కొత్తకోటలో అసాంఘిక కార్యకలాపాల పై ఉక్కుపాదం

బి.కొత్తకోట, ఆగస్టు23: బి.కొత్తకోట పట్టణంలో అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపనున్నట్లు సీఐ రాజారెడ్డి పేర్కొన్నారు. పట్టణ సీఐ గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన రాజారెడ్డి శుక్రవారం విలేఖరులతో మాట్లాడుతూ పట్టణంలో గంజాయి విక్రయించడం మూలంగా యువత పెడత్రోవ పడుతున్నట్లు సమాచారం ఉందని దీనిపై ప్రత్యేక నిఘా పెట్టి బాధ్యులపై కఠినచర్యలు తీసుకుంటామన్నారు. మద్యం, ఇసుక అక్రమరవాణాను సహించేది లేదన్నారు. పట్టణంలో డిగ్రీ కాలేజిలు ఉన్నందున ఈవ్‌టీజింగ్ పై నిఘా పెడతామన్నారు. పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ కోసం జ్యోతిచౌక్‌లో ద్విచక్రవాహనాల నిలుపుదలపై నిబంధనలు, ఆంక్షలు విధించడంతో పాటు పీటీయం రోడ్డునుంచి వచ్చి బెంగళూరు వెళ్లాల్సిన వాహనాలను ఇందిరమ్మకాలనీ వద్ద మలుపుతిప్పి శెట్టిపల్లె మీదుగా వర్రోల్లపల్లె బెంగళూరు రోడ్డు లోకి చేరేవిధంగా ట్రాఫిక్‌ను మళ్లిస్తామన్నారు. పట్టణంలో లాఅండ్‌ఆర్డర్ పరిరక్షణ కోసం పట్టణప్రజలు సహకరించాలని కోరారు.

ఇసుక మాఫియాను అరికట్టాలి

మదనపల్లె అర్బన్, ఆగస్టు 23: ఇసుక మాఫియాను అరికట్టిప్రజలకు ఉచితంగా ఇసుకను సక్రమంగా అందివ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఎం కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ మదనపల్లెలో తవ్వేకొద్దీ మైనింగ్ మాఫియా బయట పడుతున్నట్లు పేర్కొన్నారు. ఇసుకాసురులు పట్టణం, మండలంలో పలు చోట్ల డంపింగ్ చేసి వ్యాపారాలు నిర్వహిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని దీనిపై అధికారులకు ఫిర్యాదుచేసినా పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం నాయకుడు నాగేశ్వరరావు, ఐటీయూసీ నాయకుడు కృష్ణమూర్తి, సీఐటీయూ హరిశర్మ, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

మదనపల్లె టౌన్, ఆగస్టు 23: అత్యవసర చికిత్స కోసం వచ్చిన రోగులకు అవసరమైన రక్తం దానం చేస్తే ప్రాణదానంతో సమానమని ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ రామలింగారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మొత్తం 92 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. ప్రిన్సిపాల్ సతీష్‌బాబు, ఎన్‌ఎస్‌ఎస్ అధికారి అరుణ్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

కలికిరి, ఆగస్టు 23: కలికిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంగ్లీషు కాంట్రాక్టు లెక్చరర్ పోస్టు భర్తీకి దరఖాస్తులు పంపుకోవాలని ప్రిన్సిపాల్ ఎం.వి.విజయకుమార్ కోరారు. కాంట్రాక్టు పద్దతిలో పనిచేయడానికి పోస్టు గ్రాడ్యుయేషన్‌లో 50 శాతం మార్కులు సాధించిన వారు ఈ నెల 28 తేదీలోగా దరఖాస్తులు పంపుకోవాలని కోరారు. 29న డెమో క్లాసులు నిర్వహిస్తామన్నారు.


ఘనంగా జాతీయ అంతరిక్ష దినోత్సవం



జాతీయ అంతరిక్ష దినోత్సవంలో పాల్గొన్న బసినికొండ హైస్కూల్ విద్యార్థులు

మదనపల్లె అర్బన్, ఆగస్టు 23: జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని శుక్రవారం బసినికొండ జడ్పీ హైస్కూల్, జిల్లా బాలికల ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్కూల్ పిల్లలతో ఉపగ్రహ నమూనాలు, రాకెట్ నమునాల ప్రదర్శన పాఠశాల స్థాయిలో ర్యాలీ నిర్వహించారు. చంద్రయాన్-3 విజయవంతం కావడంతో జాతీయ అంతరిక్ష దినోత్సవం జరుపుకుంటున్నామని హెచ్‌ఎంలు తెలిపారు. బసినికొండ హెచ్‌ఎం శ్రీనివాసులు చంద్రయాన్-3 విజయాన్ని పిల్లలకు వివరించారు. బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం జనా ర్ధన్‌రెడ్డి, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు పిల్లలకు వక్తృత్వ, వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

పరిశోధనలతోనే దేశాభివృద్ధి సాధ్యం



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఇస్రో శాస్త్రవేత్త చిరంజీబ్ గుహా మజుందార్

కురబలకోట, ఆగస్టు 23: పరిశోధనలతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని ఇస్రో శాస్త్రవేత్త చిరంజీబ్ గుహా మజుందార్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇస్రో చంద్రయాన్-3 విజయంతో ఈ దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. యువత శాస్త్రసాంకేతిక రంగాలపై దృష్టి సారించాలన్నారు. ప్రిన్సిపాల్ యువరాజ్ పాల్గొన్నారు.

కోర్టులో గంగమ్మకు ప్రత్యేక పూజలు

మదనపల్లె అర్బన్, ఆగస్టు 23: కోర్టులో వెలసిన కోర్టులో గంగమ్మకు ఆలయకమిటీ ఆధ్వర్యంలో శ్రావణ శుక్రవారం విశేషపూజలు నిర్వహించారు. అంతకముందే ఆలయాన్ని తోరణాలతో శోబామయానంగా అలంకరించారు. ఉదయాన్నే సుప్రభాత సేవతో అమ్మవారిని మేల్కొలిపి విశేషపూజలు నిర్వహిం చారు. మహిళలు ఉదయాన్నే ఆలయం చేరకుని రాహుకాల సమయంలో ప్రత్యేక పూజలు చేసి. చీర. జాకెట్లు, పసుపు, కుంకుమ, పొంగళ్లు నైవేద్యంగా అమ్మకు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయకమిటీ అధ్య క్షుడు మార్వారి చిన్నరెడ్డెప్ప ఉపాధ్యక్షుడు వేణుగోపాల్ నాయుడు, కార్యదర్శి మార్వారి ప్రభాకర్ నాయుడు, ట్రెజరర్లు రంగ స్వామినాయుడు, కరుణాకర్ నాయుడు, విక్కీ, మహేష్, దేవేంద్ర, బోయపాటి శ్రీనివాసులునాయుడు పర్యవేక్షించారు.